గురువారం
23-05-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 331
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

వియత్నాం అధ్యక్షుడిగా టు లామ్ ప్రమాణం

హనోయ్: వియత్నాం నూతన అధ్యక్షుడిగా కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు టు లామ్ బుధవారం ఎన్నికయ్యారు. అనంతరం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానని ప్రతిజ్ఞ బూనారు. దేశానికి, దేశ ప్రజలకు సేవ చేస్తానని హామీనిచ్చారు. వియత్నాం నేషనల్ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా టు లామ్ ఎన్నిక జరిగింది. ఆయన 2026 వరకు అధ్యక్ష బాధ్యతలు చేపడతారు. టు లామ్ 1957లో జన్మించారు. 2016 ఏప్రిల్‌లో ప్రజాభద్రతా శాఖ మంత్రిగా పనిచేశారు.

పిన్నెల్లికి లుకౌట్ నోటీసు

- అన్ని విమానాశ్రయాల్లో నిఘా
- ఈవీఎం ధ్వంసం కేసులో 10 సెక్షన్ల కింద కేసులు
- పోలీసుల విస్తృత గాలింపు
- ఇస్నాపూర్ గెస్ట్‌హౌస్‌లో అరెస్ట్ అయినట్లు వదంతులు
- ధృవీకరించని పోలీసు అధికారులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఈనెల 13వ తేదీ పోలింగ్ సందర్భంగా మాచర్ల నియోజకవర్గ పరిధిలోని పాల్వాయి గేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీప్యాట్‌లు ధ్వంసం చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఐపీసీ, ప్రజాప్రాతినిధ్య చట్టం, పీడీపీపీ చట్టాల పరిధిలో 10 సెక్షన్లతో పిన్నెల్లిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఐపీసీ 143, 147, 448, 427, 353, 452, 120 బి, ఆర్పీ చట్టం 131, 135 సెక్షన్లతో కేసులు నమోదయ్యాయి. ఈనెల 20వ తేదీనే పిన్నెల్లిపై కేసులు నమోదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. పిన్నెల్లి విదేశాలకు పారిపోయేందుకు యత్నిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో అన్ని విమానాశ్రయాలను ఏపీ పోలీసులు అప్రమత్తం చేశారు. ఆ మేరకు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే పిన్నెల్లిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. తెలంగాణలో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీస్ ప్రత్యేక బృందాలు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. పల్నాడు జిల్లా ఎస్పీ అధ్వర్యంలో ఈ బృందాలను ఏర్పాటు చేశారు. ఏపీ పోలీసులు, తెలంగాణ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. పిన్నెల్లి సంగారెడ్డి వైపు వస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇస్నాపూర్ సమీపంలోని ఓ కంపెనీ గెస్ట్‌హౌస్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇస్నాపూర్ లోకేషన్ గురించి పటాన్‌చెరు పోలీసుల

- మిగతా 2 లో

అభాసుపాలు

వెలుగు చూస్తున్న ఈసీ వరుస వైఫల్యాలు

- 13న ఈవీఎంలు పగలగొడితే 20న కేసు నమోదు
- పోలీస్ వైఫల్యం వల్లే హింస అంటూ సిట్ స్పష్టీకరణ
- నిందితుల అరెస్ట్‌లోనూ పోలీసుల ఉదాసీనత
- పోలింగ్ తర్వాత సీఎస్, డీజీపీలకు సీఈసీ సమన్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల సంఘం గతంలో ఎన్నడూ లేనంతగా అభాసుపాలైంది. పోలింగ్‌లో ప్రతి ఒక్క ఓటరూ స్వేచ్ఛగా పాల్గొనేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని పదేపదే ప్రకటనలు గుప్పించిన ఎన్నికల సంఘం...ఆచరణలో ఘోర వైఫల్యం చెందింది. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పోలింగ్ సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసులు సహా అనేక మంది ఆసుపత్రుల పాలయ్యారు. అప్పటికీ పోలీస్ యంత్రాంగం అప్రమత్తం కాకపోవడంతో పోలింగ్ తర్వాత రోజు కూడా అనేక ప్రాంతాల్లో ఘర్షణలు తలెత్తాయి. అనేక ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఘటనలు జరగడం ఒక ఎత్తయితే... బాధ్యులపై చర్యలు తీసుకోవడంలోనూ ఈసీ వైఫల్యం చెందింది. రాష్ట్రవ్యాప్తంగా 46,389 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో 12,438 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. వీటిలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఈసీ వెల్లడించింది. మొత్తం పోలింగ్ కేంద్రాల్లో మూడో వంతు అంటే 31,385 పోలింగ్ కేంద్రాలను పూర్తిస్థాయిలో లోపలా, బయటా వెబ్‌క్యాస్టింగ్ ద్వారా జిల్లా, రాష్ట్రస్థాయిల్లో నిరంతరాయంగా పర్యవేక్షించే ఏర్పాట్లు చేపట్టారు. ఇందుకు సుమారు 150 మంది సిబ్బందిని కేటాయించారు. జీరో వయలెన్స్, నూరుశాతం పోలింగ్ లక్ష్యమని ప్రకటించిన ఈసీ...తీరా చూస్తే తొమ్మిది పోలింగ్ కేంద్రాల్లో దౌర్జన్యకారులు ఈవీఎంలను ధ్వంసం చేసి...బీభత్సం సృష్టించారు. రెంటచింతల మండలం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రాన్ని అత్యంత సమస్యాత్మక కేంద్రంగా ఎన్నికల సంఘం గుర్తించింది. కానీ ఇక్కడ కేవలం ఇద్దరు కానిస్టేబుళ్లను మాత్రమే భద్రత కోసం వినియోగించారు. ఇదే బూత్‌లో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం, వీవీప్యాట్ మెషిన్లను నేలకేసి పగులగొట్టారు. అభ్యంతరం వ్యక్తం చేసిన వారిని ఆయన బెదిరించారు. అంతేగాక...అడ్డుకోవడానికి ప్రయత్నించిన టీడీపీ ఏజెంట్‌పై ఆయన అనుచరులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. విచిత్రమేమిటంటే అక్కడి ఎన్నికల సిబ్బంది ఈవీఎం మెషిన్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఫిర్యాదు చేయగా...

- మిగతా 2 లో

వైఫల్యమే: సీఈఓ మీనా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఈవీఎం ధ్వంసం ఘటనను సిగ్గుమాలిన చర్యగా కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొందని, స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో వైఫల్యంగా ఈసీ దీనిని గుర్తించిందని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా తెలిపారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి ఘటనలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వెల్లడించారు. పోలింగ్ రోజున ఏపీలో మొత్తం 9 చోట్ల ఈవీఎంలు ధ్వంసమయ్యాయని, మాచర్లలో 7 ఘటనలు

- మిగతా 2 లో

నేటి నుంచి పాలిసెట్ ప్రవేశాలు

7న సీట్ల కేటాయింపు, 10న తరగతుల ప్రారంభం: నాగరాణి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాలిసెట్ 2024 అడ్మిషన్ల ప్రక్రియ మే 23వ తేదీ గురువారం నుంచి ప్రారంభమవుతుందని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, సాంకేతిక విద్య, శిక్షణా మండలి చైర్మన్ చదలవాడ నాగరాణి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె ఈ విషయం వెల్లడించారు. నాగరాణి మాట్లాడుతూ ప్రవేశాలకు సంబంధించిన ఫీజు చెల్లింపు తదితర ఆన్‌లైన్ ప్రక్రియకు ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. ధృవపత్రాల పరిశీలనకు ఈనెల

- మిగతా 2 లో

ప్రచార తీరుపై ఈసీ కన్నెర్ర

- కులం, మతం ప్రస్తావన వద్దు
- సామాజిక విభజనకు దారితీసే ప్రసంగాలు చేయొద్దు
- రాజ్యాంగం రద్దవుతుందని చెప్పవద్దు
- బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులకు నోటీసులు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాన రాజకీయ పార్టీలు-బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న ప్రచార సరళిపై కేంద్ర ఎన్నికల సంఘం కన్నెర్ర చేసింది. ఎన్నికల ప్రచారాల్లో కులం, మతం గురించి ప్రస్తావించవద్దని బుధవారం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. పరస్పర విమర్శల విషయంలో ఆయా పార్టీల అగ్రనేతలు, ప్రధాన ప్రచారకర్తలు హుందాగా వ్యవహరించాలని సూచించింది. ప్రసంగాలు గాడి తప్పుతుండటాన్ని గమనంలో పెట్టుకోవాలని ఆదేశించింది. ప్రచార శైలిలో మార్పు అవసరమని హితవు పలికింది. ఇప్పటికే ఐదు దశల్లో ఎన్నికలు జరిగాయి. ఆరో దశకు రంగం సిద్ధమైంది. ఇప్పటికైనా ప్రచారాన్ని హుందాగా నిర్వహించేలా తమ తమ ప్రచారకర్తలకు ఆదేశాలివ్వాలని బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులు జేపీ నడ్డా, మల్లికార్జున ఖడ్గేకు

- మిగతా 2 లో

ప్రతి పైసా లెక్క తేలుస్తాం

అదానీ బొగ్గు కుంభకోణంపై జేపీసీ విచారణ: కాంగ్రెస్

న్యూఢిల్లీ: ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే అదానీ బొగ్గు కుంభకోణంపై జేపీసీతో విచారణ జరిపిస్తామని, ప్రతి పైసా లెక్క తేలుస్తామని కాంగ్రెస్ బుధవారం హామీనిచ్చింది. నాసిరకం బొగ్గును మూడు రెట్లు ఎక్కువ ధరకు తమిళనాడు పీఎస్‌యూకు అదానీ గ్రూపు విక్రయించి భారీగా లాభాలు గడించిందని ఆరోపించింది. బీజేపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమ కార్యకలాపాలు అన్నింటిపై దర్యాప్తు జరిపిస్తామని నొక్కిచెప్పింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'ఎక్స్' మాధ్యమంగా స్పందిస్తూ 'బీజేపీ హయాంలో భారీ బొగ్గు కుంభకోణం జరిగింది. ప్రధాని మోదీకి ఎంతో ఇష్టమైన అదానీ వేల

- మిగతా 2 లో

నిష్పాక్షిక విచారణ అవసరం

- మలివాల్ కేసులో రెండు కోణాలనూ పరిశీలించాలి
- 'ఇండియా' ప్రధానిపై ఎన్నికల తర్వాతే నిర్ణయం
- సునీత క్రియాశీల రాజకీయాల్లోకి రారు
- పీటీఐ ఇంటర్వ్యూలో కేజ్రీవాల్

న్యూఢిల్లీ: తమ పార్టీ నేత స్వాతి మలివాల్ వ్యవహారంలో విచారణ నిష్పాక్షికంగా జరగాలని, న్యాయం చేకూరాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఈ కేసులో రెండు కోణాలు ఉన్నాయని, అందువల్ల పోలీసులు రెండింటిని విచారిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. స్వాతి మలివాల్ వ్యవహారంలో కేజ్రీవాల్ మొదటిసారి నోరు విప్పారు. 'ఇది న్యాయ పరిధిలోని అంశం కాబట్టి నా వ్యాఖ్యలతో విచారణపై ప్రభావం ఉండవచ్చు' అని బుధవారం పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అన్నారు. ఈ ఘటన జరిగినప్పుడు ఇంట్లోనే ఉన్నారా అన్న ప్రశ్నకు ఘటనాస్థలిలో లేనంటూ బదులిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిస్తే ప్రధాని అవుతారా అని అడిగితే 'నాకు అలాంటి ఉద్దేశం లేదు' అని ఆయన స్పష్టంచేశారు. ప్రధాని ఎవరన్నది ఇప్పటివరకు ప్రతిపక్ష కూటమిలో చర్చ జరగలేదని తెలిపారు. ఆప్ చిన్న

- మిగతా 2 లో

భరోసా ఏది?

- నిరర్థకంగా ఆర్బీకేలు
- కానరాని పురుగు మందులు, సాగు సలహాలు
- వ్యవసాయశాఖ మొద్దునిద్ర
- ఆందోళనలో రైతులు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: రైతులకు అవసరమైన అన్ని సేవలు రైతు భరోసా కేంద్రాలలోనే అందిస్తాం... ఎరువులు, పురుగు మందుల విక్రయాలు మొదలు అన్ని పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు అన్ని సేవలు ఇక్కడే... వైసీపీ ప్రభుత్వం ఆర్బీకేలపై ఆర్భాటంగా చెప్పిన మాటలు ఇవి. కానీ ఆచరణ మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. ఆర్బీకేల ద్వారా సాగు సలహాలు, సేవలు అందకపోయినా అన్ని రకాల ఎరువులు, విత్తనాలు అందుబాటులో లేకపోయినా... ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఆదుకోకుండా ముఖం చాటేసినా... రైతులు పంటి బిగువున భరించారు. నష్టాలు చూడని రైతులు లేరు... త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండగా... ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అధికారుల వద్ద సరైన ప్రణాళికలు లేవు. మరోపక్క సాగు ప్రోత్సాహకాలలో కోతలు పడటంతో ఇప్పుడు ఎన్ని అవస్థలు పడాల్సి వస్తుందోనన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

పర్యవేక్షించే నాథుడే లేరు...

వ్యవసాయ యాంత్రీకరణ పేరుతో రైతు బృందాలకు యంత్రాలు, పరికరాలు

- మిగతా 2 లో

యాజమాన్య కోటా సీట్లు రిజర్వు?

- ప్రైవేట్‌లో ఇంజినీరింగ్ కళాశాలల్లో కౌన్సెలింగ్‌కు ముందే ప్రవేశాలు
- డిమాండ్ బ్రాంచ్‌లకు భారీగా ఫీజులు
- నేటితో ముగియనున్న ఏపీఈఏపీసెట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈ విద్యా సంవత్సరానికిగాను ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో యాజమాన్య కోటా సీట్లను ముందస్తుగా రిజర్వు చేస్తున్నారు. ప్రత్యేక పీఆర్వో వ్యవస్థతో విద్యార్థులను ఇంజినీరింగ్ కోర్సుల్లో చేర్పిస్తున్నాయి. వాస్తవంగా కన్వీనర్ కోటా సీట్లు పూర్తయ్యాక, ప్రభుత్వం అనుమతితో నోటిఫికేషన్ ఇచ్చి మేనేజ్‌మెంట్ సీట్లను భర్తీ చేయాల్సి ఉంటుంది. దీనికి విరుద్ధంగా యాజమాన్య సీట్లను ముందస్తుగానే రిజర్వుడు చేస్తున్నారని తెలిసింది. కంప్యూటర్, వాటి అనుబంధ బ్రాంచిలకు భారీ ఫీజులను నిర్ధారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు ముగియకముందు, ఇంకా కౌన్సెలింగ్ ప్రారంభం కాకముందే... ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు ప్రవేశాలకు తెరదీశాయి. ముందుగా మేనేజ్‌మెంట్ కోటాలో సీటు రిజర్వు చేసుకుని, ఆ తర్వాత కన్వీనర్ కోటాలో ఇదే కళాశాలలో సీటు వస్తే, మార్చుకునేలా కొంత ప్రవేశ సొమ్మును వసూలు

- మిగతా 2 లో

ఇదీ లోకం!



రూ.20 కోట్లకు 'తుక్కు'టోపీ!

- అధిక లాభాలు ఆశచూపి పరారైన వ్యాపారి
- లబోదిబోమంటున్న బాధితులు
- పశ్చిమ ఏసీపీకి ఫిర్యాదు

తుక్కు వ్యాపారంతో అధికలాభాలు గడించవచ్చని... లాభాల్లో అధిక శాతంవాటా ఇస్తానని తెలిసినవారిని తెలివిగా నమ్మించి రూ.20 కోట్లకు కుచ్చుటోపీ పెట్టి పరారైన మోసగాడి చరిత్ర ఇది. తొలుత గడించిన లాభంలో రూ. నాలుగు లక్షలు మీ వాటా కింద ఇస్తున్నానని మరింత నమ్మబలికి కోట్లాది రూపాయలతో తుక్కు వ్యాపారి ఉడాయించడంతో మోసబోయామని తెలుసుకున్న స్నేహితులు లబోదిబోమంటున్నారు. ఆందోళనకు గురైన బాధితులు మోసగాడి కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో చేసేది లేక న్యాయం కోసం పోలీస్ ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేశారు.

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): నేను మా మామతో కలిసి తుక్కు వ్యాపారం చేస్తున్నా... పెట్టుబడికి కొంత డబ్బులు తగ్గాయి... మీరు సర్దుబాటు చేస్తే తుక్కు కొనుగోలు చేసి వెంటనే అమ్మేస్తా... భారీగా లాభాలు వస్తాయి... మీకు అసలు వెంటనే చెల్లించడంతోపాటు లాభాల్లో వాటా ఇస్తా... అని నమ్మించి ఓ వ్యాపారి రూ.20 కోట్ల మేర వసూలు చేసి పరారైన ఘటన ఇది. వివరాలివి. మహ్మద్ అబ్దుల్ ఫహీమ్ అనే వ్యక్తి మూడేళ్ల క్రితం వరకు విజయవాడ వన్‌టౌన్‌లోని వించిపేటలో నివాసం ఉండేవాడు. అనంతరం నివాసం మార్చి మూడేళ్లుగా గుంటూరు జిల్లా నులకపేటలో ఉంటున్నాడు. అతడు ఫహీమ్ ట్రేడర్స్ పేరుతో చిత్తు వ్యాపారం చేస్తున్నారు. తన మామ ఇక్బాల్‌తో కలిసి ఈ వ్యాపారం చేస్తున్నట్లు చెప్పేవాడు. తన మామ ట్రేడ్ లైసెన్స్‌తో పాటు ఫహీమ్ ట్రేడర్స్ పేరుతో ట్రేడ్ లైసెన్స్, ఇతర దాక్యుమెంట్లు చూపించాడు. తనకు వ్యాపారంలో పెట్టుబడి కోసం కొంత డబ్బులు తగ్గాయని, సర్దుబాటు చేస్తే సరుకు కొనుగోలు చేసి వెంటనే తిరిగి అసలుతోపాటు లాభాల్లో కూడా వాటా ఇస్తానని నమ్మించాడు. ఈ క్రమంలో వించిపేటకు చెందిన మహ్మద్ అక్బర్ ఇమ్రాన్ 2020లో కొంత డబ్బు ఇచ్చాడు. ఆయనకు తిరిగి రెండు విడతల్లో రూ.నాలుగు లక్షలు ఇచ్చి... ఇది లాభం మాత్రమేనని ఫహీమ్ చెప్పాడు. దీంతో నమ్మకం పెంచుకున్న ఇమ్రాన్, 2020 నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.80 లక్షలు ఇచ్చాడు. ఇటీవల ఓ ప్రైవేట్ సంస్థ చిత్తు టెండర్ రూ. ఏడు కోట్లకు తమ సంస్థకు ఇచ్చిందని, పెట్టుబడికి కొంత డబ్బులు కావాలని ఫహీమ్ మళ్లీ నమ్మబలికాడు. దీంతో ఇమ్రాన్ తనకు తెలిసినవారి వద్ద అప్పులు చేసి ఈ ఏడాది ఫిబ్రవరి ఎనిమిదో తేదీన రూ.9.2 లక్షలు, రూ.9.7 లక్షలు, రూ.10 లక్షలను ఆన్‌లైన్ ద్వారా ఫహీమ్ ఖాతాకు పంపాడు. అయితే, అప్పటి నుంచి ఫహీమ్ టెండర్ గురించి గాని, డబ్బుల గురించి ప్రస్తావించకపోవడంతో అక్బర్ ఇమ్రాన్ నిలదీయడంతో అతడి సెల్‌ఫోన్‌కు ఓ ప్రైవేట్ సంస్థ నుంచి ఫహీమ్ ట్రేడర్స్‌కు రూ.ఏడు కోట్ల చిత్తు టెండర్ ఖరారైనట్లు ఒక లేఖను, రూ.ఏడు కోట్లకు తీసిన డీడీని పంపించాడు. ఆ తర్వాత అతడి నుంచి సమాధానం లేకపోవడంతో అనుమానం వచ్చి ఈ నెల 15వ తేదీన ఫహీమ్ ఇంటికి వెళ్లగా, అతడు పది రోజులుగా ఇంటికి రావడం లేదని కుటుంబ సభ్యులు చెప్పారు. దీంతో ఆందోళనకు గురైన ఇమ్రాన్ అతడి కోసం ఎంతగాలించినా ప్రయోజనం లేకుండాపోయింది. అదే సమయంలో ఫహీమ్ కనిపించడం లేదనే విషయం అతడి స్నేహితులకు తెలియడంతో వారు కూడా బయటకు వచ్చి తాము పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చామని చెబుతున్నారు. ఇమ్రాన్ తరహాలోనే విజయవాడకు చెందిన ఎస్కే ఇబ్రహీం ఖలీల్, షేక్ ఇర్షాద్, షేక్ అబ్దుల్ హమీద్ పాషా, షఫీ ఉల్లా ఖాన్, అస్గర్ హుస్సేన్, పఠాన్ బాజీ, అబ్దుల్ రషీద్, షేక్ ఖాజా, అబ్దుల్ రహిమాన్, షబ్బీర్ మరికొంత మందికి కూడా చెప్పి వారి నుంచి కూడా ఫహీమ్ రూ.20 కోట్లకు పైగా వసూలు చేసి మొఖం చాటేసినట్లు సమాచారం. దీంతో బాధితులంతా తమకు న్యాయం చేయాలని సీపీని కలిసేందుకు వెళ్లగా అందుబాటులోలేకపోవడంతో విజయవాడ వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.

మాచర్లలో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

పిన్నెల్లి సోదరులను అరెస్ట్ చేయాలి

ఈసీకి ముప్పాళ్ల డిమాండ్

విశాలాంధ్ర-నరసరావుపేట: ఎన్నికల సందర్భంగా మాచర్ల నియోజకవర్గం పాల్వాయి గేటు పరిధిలోని 202 పోలింగ్ బూత్‌లోని ఈవీఎంను అధికారుల సాక్షిగా ధ్వంసం చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఎన్నికల కమిషన్‌ను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లాలో జరుగుతున్న దాడులపై ముప్పాళ్ల తీవ్రస్థాయిలో స్పందించారు. సుమారు 20 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న సీనియర్ నాయకుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు ఆయన సోదరుడి అధ్వర్యంలో పాల్వాయి గేటు పోలింగ్ బూత్‌తో పాటు మరో ఏడు పోలింగ్ బూత్‌లో ఈవీఎంలను పగలు కొట్టారన్నారు. ఎమ్మెల్యే స్వయంగా ఈవీఎంలను ధ్వంసం చేస్తే ... ఎన్నికల అధికారులు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, రికార్డు చేయటం సిగ్గుచేటన్నారు. ఎన్నికల మరుసటి రోజు ఎమ్మెల్యే అధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు కారంపూడిలో కర్రలు, రాడ్లతో స్వైర విహారం చేసి ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపై, కార్యకర్తలపై దాడులు చేశారని, డ్యూటీలో ఉన్న సీఐపై దాడి చేశారని మండిపడ్డారు. మాచర్ల నియోజకవర్గంలో ఆటవిక రాజ్యం సాగుతోందని, ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరుల అవినీతి, అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు, దాడులు చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులు చోద్యం చూస్తున్నారని... మాచర్లలో జరిగిన సంఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. పిన్నెల్లికి తొత్తులుగా మారిన ఎన్నికల అధికారులు, పోలీసులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పిన్నెల్లిని అరెస్ట్ చేసి, అక్రమంగా సంపాదించిన ఆస్తులను జప్తు చేయాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు.

ఘనంగా వీఎస్‌యూ స్నాతకోత్సవం

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) ఎనిమిది, తొమ్మిదవ స్నాతకోత్సవం ముఖ్య బుధవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి అబ్దుల్ నజీర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విశ్వవిద్యాలయంలో ఆధునిక వసతులతో నిర్మించిన భవనాలు, హాస్టళ్లు బాగున్నాయన్నారు. వీఎస్‌యు గత రెండు సంవత్సరాల్లో సాధించిన విజయాల శ్రేణి అంచనాలను మించిందన్నారు. విద్యార్థులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించడంతో పాటు అత్యాధునిక భవనాలు నిర్మించి... మౌలిక సదుపాయాల అభివృద్ధికి గణనీయమైన చర్యలు తీసుకున్నారన్నారు. యువ గ్రాడ్యుయేట్లు పట్టుదలతో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. విద్యార్థులందరూ ఈ ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం నుండి పొందిన జ్ఞానాన్ని ఎల్లప్పుడూ వినయంగా ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. తొలుత గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రారెడ్డి ఘనంగా సత్కరించారు. స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు యూనివర్సిటీకి విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు యూనివర్సిటీ వీసీ సుందరవల్లి, జిల్లా కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని గవర్నర్ స్వీకరించారు. అనంతరం యూనివర్సిటీ ప్రొఫెసర్లతో గవర్నర్ గ్రూప్ ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, నుడా వీసీ బాపిరెడ్డి, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడులు తెరిచే నాటికి...

పాఠ్యపుస్తకాలు సిద్ధం చేయాలి

ఏకరూప దుస్తులు ఉండాలి

విద్యాశాఖాధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వేసవి సెలవుల తరువాత వచ్చే నెల 12న రాష్ట్రంలోని పాఠశాలలు తెరుచుకునే నాటికి పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు ఏకరూప దుస్తులు, బ్యాగులు వంటివన్నీ విద్యార్థులకు అందాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి బుధవారం విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. 2024-25 విద్యా సంవత్సర సన్నాహక ఏర్పాట్లపై వెలగపూడి సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. రానున్న విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యాశాఖ సన్నాహక చర్యలను సమీక్షించారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బ్యాగులు, బూట్లు సకాలంలో అందించే చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల వారీగా విద్యార్థులకు అవన్నీ అందేలా చూడాలని సీఎస్ ఆదేశించారు. పాఠశాలల్లో నాడు-నేడు కింద చేపట్టిన పనుల ప్రగతిని, మధ్యాహ్న భోజన వసతి తదితర అంశాలపైనా సీఎస్ సమీక్షించారు. సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్... పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రానున్న విద్యా సంవత్సరానికి తీసుకుంటున్న సన్నాహక ఏర్పాట్లను సీఎస్‌కు వివరించారు. ఇప్పటికే 82శాతం పుస్తకాల ప్రచురణ పూర్తయి మండల స్టాకు పాయింట్లకు చేరాయని చెప్పారు. రానున్న విద్యా సంవత్సరంలో 1 నుంచి 10 వరకు బై-లింగువల్ పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేస్తామన్నారు. 1నుంచి 10 వరకు మొత్తం 70లక్షల 42వేల 12 మంది విద్యార్థులను నమోదు చేయగా వారిలో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 36 లక్షల 54 వేల 539 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. పాఠశాల విద్యా మౌలిక సదుపాయాల గురించి కమిషనర్ కె.భాస్కర్ వివరిస్తూ నాడు-నేడు రెండో విడత-2 కింద 7వేల 29కోట్ల రూపాయిలతో వివిధ పాఠశాలల్లో నిరంతర తాగునీటి సరఫరాతో కూడిన మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ప్రాథమిక సౌకర్యాలు, రంగులు, ఆయా పాఠశాలలకు మరమ్మతులు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం ఏర్పాటు చేశామన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో మధ్యాహ్న భోజన పథకం అమలు సన్నాహక ఏర్పాట్లపై పథకం సంచాలకులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వివరిస్తూ పౌర సరఫరాల శాఖ ద్వారా బియ్యం, రాగులు, జొన్న, చిక్కీ, కోడిగుడ్లు సకాలంలో సమకూర్చుకునే ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సమావేశానికి ఏపీఎస్టీ శ్రీనివాసరావు, విద్యాశాఖ అధికారులు హాజరయ్యారు.

కిర్గిస్థాన్ పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ

ఏపీఎన్‌ఆర్టీఎస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కిర్గిస్థాన్‌లో నెలకొన్న పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, మన తెలుగు విద్యార్థులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థ ఏపీఎన్ఆర్టీ సొసైటీ తెలిపింది. ఈ మేరకు ఏపీఎన్‌ఆర్టీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఏపీఎన్‌ఆర్టీఎస్, అందుబాటులో ఉన్న సమాచారాన్ని, విదేశాంగ శాఖ (ఎంఈఏ) ఇస్తున్న సలహాలను, సకాలంలో విద్యార్థులకు తెలుపుతోందని వివరించింది. తమ ప్రయత్నాలకు కొనసాగింపుగా కిర్గిస్థాన్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల భద్రత, శ్రేయస్సు, ప్రస్తుత పరిస్థితి, విద్యార్థుల సమస్యలను వివరిస్తూ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, యురేషియా అదనపు కార్యదర్శి చరణ్‌జీత్ సింగ్ కార్యాలయంతో సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు తెలిపింది. కిర్గిస్థాన్‌లో ఏపీ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి వస్తున్న అభ్యర్థనలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు వివరిస్తూ త్వరితగతిన విద్యార్థులను స్వదేశానికి రప్పించే అవకాశాలపై ఏపీఎన్‌ఆర్టీఎస్ ఆరా తీసినట్లు పేర్కొంది. అదనపు కార్యదర్శి కార్యాలయం-యురేషియా, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, దీనిపై స్పందించి కిర్గిస్థాన్‌లో బిషెక్‌లో ప్రస్తుత పరిస్థితి సాధారణంగానే ఉందని తమకు తెలియజేసినట్లు ఏపీఎన్‌ఆర్టీఎస్ స్పష్టంచేసింది. వైద్య విద్యార్థులు భారతదేశానికి తిరిగి రావడానికి ముందు, నేషనల్ మెడికల్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. విద్యార్థులు దేశానికి తిరిగి రావాలనుకుంటే, ఈ నెల 23 నుంచి బిషెక్ నుంచి న్యూఢిల్లీకి నేరుగా ప్రతిరోజూ రెండు విమానాలు నడుస్తాయని విదేశాంగ శాఖ తమకు సమాచారం ఇచ్చిందని, ఏదైనా అత్యవసర సహాయం కోసం, భారతీయ/తెలుగు విద్యార్థులు బిషెక్‌లోని భారత రాయబార కార్యాలయ హెల్ప్‌లైన్ నంబర్ 0555710041ను సంప్రదించాలని ఏపీఎన్‌ఆర్టీఎస్ పేర్కొంది. కిర్గిస్థాన్‌లోని ఏపీ విద్యార్థులు సహాయం కోసం ఏపీఎన్‌ఆర్టీఎస్ 24/7 హెల్ప్‌లైన్ నంబర్లు +91 863 2340678, + 91 85000 27678 (వాట్సాప్)ను సంప్రదించాలని తెలిపింది.

'మంచినీటి' కార్మికులకు

వేతన బకాయిలు చెల్లించండి: డేగా

విశాలాంధ్ర-ఏలూరు: శ్రీసత్యసాయి మంచినీటి పథకం కార్మికులకు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, ప్రాజెక్ట్ మెయింటినెన్స్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆ పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని కోరుతూ కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జిల్లా పరి షత్ కార్యనిర్వహణాధికారి కె.ఎస్. ఎస్. సుబ్బారావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మంచినీటి పథకం ద్వారా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సుమారు 180 గ్రామాల్లో ఐదు లక్షల మంది ప్రజలకు తాగునీరు సరఫరా జరుగు తుందన్నారు. 100 మంది కార్మికులు పని చేస్తున్నారని, కొత్త కాంట్రాక్టర్ వీరికి జనవరి నుంచి జీతాలు చెల్లించలేదన్నారు. పచారీ దుకాణాల్లో సైతం వీరికి అప్పు కూడా పుట్టడం లేదని, ఇంటి అద్దె, పిల్లలకు స్కూల్‌లో ఫీజులు చెల్లించలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. లైన్‌మెన్, ఆపరేటర్, ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, వాచ్‌మెన్... ఇలా వివిధ గ్రేడ్‌లలో పనిచేస్తున్నారని, గతంలో దీన్ని నిర్వహించిన ఎల్ అండ్ టీ, ఆర్‌డబ్ల్యుఎస్ తొమ్మిది నెలలు పైసా కూడా ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం స్పందించి జీతం బకాయిలు చెల్లించి ఈఎస్‌ఐ, ఈసీఎఫ్, బోనస్ అమలుపరిచే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఇదిలా ఉండగా... కలెక్టర్, జిల్లా పరిషత్ కార్యనిర్వహణ అధికారి జీతాల చెల్లింపునకు చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ అధ్యక్షుడు ఎం.వి. అర్.ఎస్. ప్రసాద్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, యూనియన్ సభ్యులు టి.భాస్కర్ రావు, ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టారు

ఈసీకి టీడీపీ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన అల్లర్లపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి టీడీపీ మరోసారి ఫిర్యాదు చేసింది. ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనాకు టీడీపీ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. తాడిపత్రిలో జరిగిన అల్లర్లలో బాధితులైన టీడీపీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టారని వివరించారు. రాజంపేట డీఎస్పీ చైతన్య ఎవరి ఆదేశాలతో దాడులకు పాల్పడ్డారో అంతుబట్టడం లేదని మీనా దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మీడియాతో దేవినేని ఉమా, దీపక్‌రెడ్డి మాట్లాడుతూ అస్మిత్ రెడ్డి ఇంటిపై డీఎస్పీ చైతన్య దాడికి పాల్పడి వ్యక్తిగత సిబ్బంది, డ్రైవర్లు, పొరుగువారిని గాయపరిచారని తెలిపారు. తాడిపత్రి అల్లర్లలో తాను లేకపోయినా 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారని దీపక్‌రెడ్డి చెప్పారు. జూన్ 4న అస్మిత్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను కౌంటింగ్‌కు దూరంగా ఉంచాలని కుట్ర జరుగుతోందన్నారు. తాడిపత్రి పోలీసుల ఏకపక్ష చర్యను నిలువరిస్తూ తమ హక్కులు రక్షించాలని కోరారు. ఎన్నికల రోజున తాడిపత్రిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారెడ్డి, ఆయన కుమారుడు హింసను ప్రేరేపించడంతో పాటు పోలింగ్ బూత్‌ల్లోకి అక్రమంగా చొరబడి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి దాడులకు పాల్పడ్డారన్నారు. ఈ దాడుల్లో ఏఎస్పీ శ్రీరామకృష్ణతో పాటు సీఐ కూడా గాయపడ్డారని వివరించారు. పెద్దారెడ్డి తన అనుచరులతో టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి ఇంటిని చుట్టుముట్టి పోలీసులను సైతం లెక్కచేయకుండా మారణాయుధాలు, బాణసంచా కాల్చి బీభత్సం సృష్టించారని చెప్పారు.

31 వరకు సీపెట్ దరఖాస్తులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్లాస్టిక్ ఇంజినీరింగ్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సీపెట్ అడ్మిషన్ టెస్ట్ (సీఏటీ) దరఖాస్తుకు ఈనెల 31 వరకు అవకాశం కల్పించినట్లు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్ (సీఐపీఈటీ) సంయుక్త సంచాలకులు సీహెచ్ శేఖర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ సీపెట్ ద్వారా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మూడేళ్ల వ్యవధిగల ప్లాస్టిక్ టెక్నాలజీ(డీపీటీ), డిప్లొమో ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్థులకుగాను రెండేళ్ల వ్యవధిగల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో ఇన్ ప్లాస్టిక్ ప్రాసెస్సింగ్ (పీజీడీ-పీపీటీ) కోర్సులు అందిస్తున్నట్లు వివరించారు. నిబంధనలను అనుసరించి అర్హులైన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. అభ్యర్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా 150 సీట్లు భర్తీ చేస్తామని వివరించారు. సీపెట్ అడ్మిషన్ టెస్ట్(సీఏటీ)ను జూన్ 9 ఆదివారం అనంతపురం, విజయవాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్సులు విజయవంతంగా పూర్తి చేసిన వారికి ప్లాస్టిక్ రంగంలో బహుళజాతి సంస్థ (ఎంఎన్‌సీ), అనుబంధ సంస్థల్లో జూనియర్ ఇంజినీర్(ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్ అండ్ మేకర్, జూనియర్ ఇంజినీర్ (మెయింటెనెన్స్), క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో ఇన్‌స్పెక్టర్ తదితర ఉద్యోగాలకు అవకాశముందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సత్తెనపల్లిలో రీ పోలింగ్ చేపట్టాలి

హైకోర్టులో మంత్రి అంబటి పిటిషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నరసారావుపేట లోక్‌సభ పరిధిలోని సత్తెనపల్లిలో రీపోలింగ్ నిర్వహించాలని కోరుతూ మంత్రి అంబటి రాంబాబు హైకోర్టులో పిటిషన్ వేశారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని 236, 237, 253, 254 పోలింగ్ కేంద్రాలలో రీపోలింగ్ నిర్వహించాలని కోరారు. ప్రతివాదులుగా ఈసీ, సీఈవోతో పాటు మరో ఐదుగురిని చేర్చారు. పోలింగ్ రోజు ఆయా బూత్‌లలో టీడీపీ నేతలు హింసాత్మక ఘటనలకు, రిగ్గింగ్‌కు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఇదే అంశంపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్ మీనాకు ఇటీవల ఫిర్యాదు చేయగా సీఈవో కార్యాలయం స్పందించలేదు. ఎక్కడా రీ పోలింగ్ అవసరం లేదని, ఎన్నికలు సక్రమంగా జరిగాయని మీనా ప్రకటించారు. దీంతో అంబటి రాంబాబు హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్ గురువారం విచారణకు రానున్నది.

వీసీబీ అభివృద్ధికి సహకరించండి

చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

విశాలాంధ్ర-బొబ్బిలి: సహకార రంగంలో పేద మధ్యతరగతి, చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తూ డిపాజిట్ దారులకు ఎక్కువ శాతం వడ్డీ అందిస్తూ సహకార స్ఫూర్తి కి న్యాయం చేస్తున్న విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు (వీసీబీ)ను మరింత అభివృద్ధిపథంలో నడిపించడానికి బ్యాంకు సభ్యులు సహాయ సహకారాలందించాలని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలోని ఓ హోటల్‌లో బ్యాంకు బొబ్బిలి బ్రాంచ్ సర్వ సభ్య సమావేశం బ్యాంక్ డైరెక్టర్ కండాపు ప్రసాదరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘ వేంద్రరావు మాట్లాడుతూ... బ్యాంకుకు రావాల్సిన బకాయిలను పైసాతో సహా వసూలు చేస్తామని తెలిపారు. 14 బ్రాంచ్ లకు సొంతభవనాలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. విశాఖపట్నం గోపాలపట్నం బ్రాంచ్ కు 889 గజాల స్థలాన్ని కొనుగోలు చేశామని, గాజువాక, చోడవరంలో కూడా స్థలం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు ఖాతాదారుల సంక్షేమ కోసం అనేక పథకాల అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జోనల్ మేనేజర్ మజ్జి సత్యనారాయణ, బ్యాంక్ డైరెక్టర్ కండాపు ప్రసాదరావు, బ్యాంక్ మేనేజర్ పక్కి సురేశ్‌కుమార్ పట్నాయక్, ముఖ్య కార్య నిర్వహణ అధికారి పీవీ నరసింహమూర్తి, బ్యాంక్ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

ఇక టీజీఎస్ ఆర్టీసీ

విశాలాంధ్ర - హైదరాబాద్: టీఎస్ ఆర్టీసీని త్వరలో టీజీఎస్‌ఆర్టీసీగా మార్చనున్నట్లు సమాచారం. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. త్వరలో లోగోలో మార్పులు చేపట్టనున్నట్లు తెలిపారు. మునుముందు బస్సులను టీజీ సిరీస్‌తో రిజిస్ట్రేషన్ చేయించనున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత నాటి ప్రభుత్వం టీఎస్‌ఆర్టీసీగా పేరు మార్చింది. అయితే ఉద్యమం సమయంలో టీజీని తెలంగాణ వాదులు, ప్రజలు ఉపయో గించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ తాము అధికారం లోకి వచ్చాక టీఎస్‌ను టీజీగా మార్చుతామని ప్రకటించింది. రాష్ట్రంలో టీజీ అమలుకు కేంద్రం ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వగా, అన్ని ప్రభుత్వ సంస్థల పేర్లలో 'టీఎస్'కు బదులు 'టీజీ'ని ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

సంపాదకీయం

జారుడుబండ నాలుకలు

ఇంతవరకు 17 సార్లు లోకసభకు జరిగిన ఎన్నికలు ఒక ఎత్తయితే 18వ లోకసభకు జరుగుతున్న ఎన్నికలు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి. ఎన్నికలలో ప్రయోజనం పొందడానికి మతాన్ని వినియోగించుకోవడం చాలా కాలంగా సాగుతున్నదే. మత ప్రసక్తి సాధారణంగా నర్మ గర్భంగా సాగేది. ఇప్పుడు మతం ఆధారంగానే బీజేపీ ఎన్నికల ప్రచారం కొనసాగిస్తోంది. ఎన్నికలలో విజయం సాధించడానికి మతాన్ని ఉపయోగించుకోవడానికి అద్వాణీ శ్రీకారం చుడ్తే మోదీ ప్రచారం అంతటినీ మత మయం చేసేశారు. గత పదేళ్ల పాలనలో చేసిన మంచేమిటో చెప్పుకోవడానికి ఏమీ మిగలని మోదీ ఎన్నికల ఒక్కో దశ గడుస్తున్న కొద్దీ ప్రచారంలో మతం పాళ్లు పెంచుతున్నారు. అబద్ధాలనే ఆశ్రయిస్తున్నారు. ఇది రెండు రకాలుగా సాగుతోంది. ఒకటి: ముస్లింల మీద విద్వేషం పెంచడం. రెండు: ముస్లింల నుంచి ముప్పు ఉందని హిందువులలో భయం పాతుకు పోయేలా చేయడం. ఇటీవలి కాలంలో అనేక మంది మోదీ భక్తులు ఆయనను అవతార పురుషుడిని చేసేశారు. 2018 డిసెంబర్ లోనే మహారాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి అవధూత్ వాఘ్ మోదీని విష్ణుమూర్తి 11వ అవతారం అని పొగిడి తరించారు. రామ జన్మ భూమి ట్రస్ట్ కార్యదర్శి 2023 డిసెంబర్‌లో మరో మారు విష్ణు మూర్తి అవతారం అన్నారు. ప్రసిద్ధ నటి కంగనా రౌనత్ కొంచెం భిన్నంగా మోదీని శ్రీరాముడి అవతారం అన్నారు. జై భగవాన్ గోయల్ మోదీని ఈ కాలపు శివాజీగా అభివర్ణించారు. ఆయన ఏకంగా "ఆజ్ కె శివాజీ: నరేంద్ర మోదీ" అని ఓ గ్రంథమే రాసేశారు. తరచుగా టీవీ చానళ్లలో కనిపించి మోదీని పొగడడంతో పునీతుడైపోయిన సంవిద్ పాత్ర అన్ని హద్దులు చెరిపేసి పూరీ జగన్నథ స్వామి మోదీ భక్తుడు అనేశారు. ఆ తరవాత ఆయన నోరు జారానని సంజాయిషీ ఇచ్చుకున్నారు. పాప ప్రక్షళనార్థం మూడు రోజులు ఉపవాస దీక్ష కూడా చేపట్టారు. టీవీ చానళ్లలో సంవిద్ పాత్ర మాటలు విన్న వారికి ఆయన ఒక్కొక్క మాట వింటూ ఉంటే రోత పుడ్తుంది. ఆయన ప్రస్తుతం ఒరిస్సా నుంచి లోకసభకు పోటీ చేస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒరిస్సాలో ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడుతూ కోణార్క దేవాలయానికి మోదీవల్లే విశ్వ వ్యాప్తంగా ప్రచారం వచ్చిందంటున్నారు. ప్రపంచ నాయకులందరూ మోదీతో కరచాలనం చేయడానికి ఉత్సాహ పడ్తున్నారని అమిత్ షా అన్నారు. మోదీ నేపథ్యంలో కోణార్క దేవాలయం ఉంటుంది చూడండి అని తన వాదనకు అమిత్ షా మరో అబద్ధాన్ని జోడించారు. పూరీకి 35 కిలో మీటర్ల దూరంలో ఉన్న కోణార్క దేవాలయాన్ని 13వ శతాబ్దంలో నిర్మించారు. అప్పటి నుంచి దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులు కోణార్క సూర్య దేవాలయం సందర్శిస్తూనే ఉన్నారు. మరి అప్పుడు మోదీ ఎక్కడున్నారు. పూరీ జగన్నథ స్వామి రథ యాత్ర చాలా ప్రసిద్ధమైంది. 1984లోనే యునెస్కో కోణార్క దేవాలయాన్ని ప్రపంచ వారసత్వంగా సంపదగా ప్రకటించింది. అప్పటికి మోదీ మహా అయితే ఆర్.ఎస్.ఎస్. కార్యకర్త కావచ్చు.

సొంత వ్యక్తిత్వం, అస్తిత్వం లేని వారు మోదీని నోరారా పొగిడినా, ఆయనను దైవాంశ సంభూతుడని కీర్తించినా ఆశ్చర్య పడనక్కర్లేదు. కానీ స్వయంగా మోదీకే ఆ అభిప్రాయం బలంగా ఉంది. "మా అమ్మ జీవించినంతకాలం ఆమె నన్ను కన్నది అనుకున్నాను. కాని ఆమె మరణించిన తరవాత ఈ దేశోద్ధరణకు పరమాత్ముడే నన్ను పంపించాడు అని భావిస్తున్నాను" అని మోదీ స్వయంగా చెప్పుకున్నారు. ఆత్మ స్తుతి, పర నిందలో అద్వితీయుడైన మోదీ ఇలా భావించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఈ ఎన్నికలలో ప్రజలు కనక మోదీని ఓడిస్తే ఓటర్లు పరమాత్ముడు పంపించిన తనను తన కర్తవ్యం పూర్తి చేయకుండా అడ్డు తగిలారు అన్నా ఆశ్చర్య పోనక్కర్లేదు. ఈ ఎన్నికలలో అసలు సమస్యలు ప్రస్తావనకు రాకుండా మోదీ సకల జాగ్రత్తలూ తీసుకున్నారు. అసత్యాలు, కట్టుకథలు, కువ్యాఖ్యానాల ఆధారంగా "అలసట లేకుండా" ఎన్నికల ప్రచార ప్రసంగాలతో హోరెత్తిస్తున్నారు. మరోవేపు ప్రతిపక్ష పార్టీలతో కూడిన "ఇండియా" ఐక్య సంఘటన జనం రోజువారీ సమస్యలను లేవనెత్తుతుండడంవల్ల వాటికి సమాధానం చెప్పలేక మోదీ సతమతమవుతున్నారు. ఆయన ఎన్నికల ప్రసంగాలన్నీ అబద్ధాల కుళ్లు కంపు కొడ్తున్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, కేంద్ర మంత్రివర్గం పార్లమెంటుకు బాధ్యత వహించే విధానానికి స్వస్తి చెప్పి మంత్రులను, బీజేపీ అధికార ప్రతినిధులను, తన భక్తులను ఆ మాటకొస్తే మొత్తం బీజేపీని ఏకేశ్వరోపాసకులుగా మార్చేశారు. ఈ ఎన్నికల ప్రచార పర్వంలో భాగంగా దేశవాసులందరినీ అదే రీతిలో ఏకేశ్వరోపాసకులను చేయాలనుకుంటున్నారు. తానను దైవాంశ సంభూతుడిగా ఇతరులు కీర్తిస్తూ ఉంటే పరవశించి పోవడానికి అలవాటు పడిన మోదీ ఆ పొగడ్తల ధాటికి నిజంగానే తాను దైవాంశ సంభూతుడిని అని నమ్ముతున్నారు. ఆత్మానందం అనుభవిస్తున్నారు. వ్యక్తి ఆరాధనను ప్రోత్సహించిన నాయకులు మన దేశంలోనే కాదు, విశ్వవ్యాప్తంగా అనేక మంది కనిపిస్తారు. ఇందిరా గాంధీతో సహా అలాంటి వారందరూ ఏదో ఒక సమయంలో ప్రజాగ్రహానికి గురి కావలసి వచ్చింది. ముసోలినీని కొట్టి చంపారు. హిట్లర్ ఆత్మహత్య చేసుకోవలసి వచ్చింది. ఓటమి అంగీకరించని మోదీకి చివరకు ఏమవుతుందో తెలియదు. ఇవన్నీ గమనిస్తే 18వ లోకసభకు జరుగుతున్న ఎన్నికలు మిగతా 17 లోకసభ ఎన్నికలకన్నా ఎంత భిన్నమైనవో అర్థం అవుతుంది. సర్వం మోదీ మయం చేయాలన్న తపన అంతిమంగా బెడిసికొట్టక తప్పదు. అప్పుడు మోదీ కీర్తిగానంలో మునిగి తేలిన జారుడుబండ నాలుక ఉన్న సంవిద్ పాత్ర, అమిత్ షాతో పాటు తక్కిన వారందరూ తల ఎక్కడ దాచుకుంటారో చూడాలి. 74 ఏళ్లుగా మన రాజ్యాంగం అమలులో ఉంది. రాజ్యాంగాన్ని పక్క దారి పట్టించిన సందర్భాలు మోదీ కన్నా ముందు కూడా అనేకం ఉండొచ్చు. కానీ రాజ్యాంగానికి ముప్పు ఉంది అన్న భావన గత అయిదారేళ్ల నుంచి ఎక్కువైంది. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలన్న ధ్యాస పెరిగింది. సామాన్య పౌరులు సైతం ఇప్పుడు రాజ్యాంగ పరిరక్షణ గురించి ఆలోచించడం మొదలు పెట్టారు. ఈ ఎన్నికలు బీజేపీకి, ఇతర పక్షాలకు మధ్య జరగడం లేదు. మోదీకి ప్రజానీకానికి మధ్య జరుగుతున్నాయి. ప్రజాగ్రహం ఉరకలెత్తితే ఎంతటి వారికైనా ప్రజలు గుణపాఠం నేర్పి తీరుతారు. "నా విష్ణుః పృథ్వీ పతిః" అన్న భ్రమలోపడి మురిసిపోయే ఎవరికైనా ఓటు ద్వారా ప్రజలు తగిన బుద్ధి చెప్తారు. ఆ విషయం మోదీకి, ఆయన భక్తులకు అర్థం కాకపోవచ్చు. కానీ జనానికి బాగానే అర్థం అవుతోంది.

మోదీని హిట్లర్, గోబెల్స్ ఆవహించారా !

ఎం కోటేశ్వరరావు

ఊరకరారు మహాత్ములు అన్నట్లుగా దేశంకోసం-ధర్మకోసం పని చేస్తున్నట్లు చెప్పుకుంటున్న నరేంద్రమోదీ, ఇతర సంఘపరివార్ నేతలను గోబెల్స్ ఆవహించినట్లు కనిపిస్తోంది. లేకుంటే ఉత్తర ప్రదేశ్‌లో సమాజవాది పార్టీ-కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వారు అయోధ్య రామాలయాన్ని బుల్‌డోజర్లతో కూల్చివేస్తారని, బాలరాముడిని తిరిగి గుడారాల్లో కూర్చో పెడతారని నరేంద్రమోదీ చెప్పారు. ఎందుకిలా మాట్లాడినట్లు?

వాట్సాప్‌లో తిరుగుతున్న ఒక వర్తమానంలో రచయిత ఎవరో తెలియదు గానీ నరేంద్రమోదీ-హిట్లర్ మధ్య ఒక పోలిక తెచ్చారు. హిట్లర్ వివాహం చేసుకోలేదు.(మోదీ వివాహం చేసుకున్నా కాపురం చేయకుండా విడాకులు కూడా ఇవ్వకుండా దూరంగా ఉంచారు. భారతీయ ధర్మాన్ని, రాజ్యాంగాన్నీ పాటించలేదు).ఒక మతం వారు దేశానికి వ్యతిరేకులనే భావాన్ని హిట్లర్ తలకు ఎక్కించుకున్నాడు.

హిట్లర్‌ను ఎవరైనా విమర్శిస్తే మద్దతుదార్లు సహించేవారు కాదు. అన్ని రకాల మీడియాను తన గురించి గొప్పలు చెప్పుకోవటానికి హిట్లర్ ఉపయోగించుకున్నాడు. తన వ్యతిరేకులందరినీ అణచివేశాడు. వారు దేశ ద్రోహులని, జాతి వ్యతిరేకులని ఎల్లవేళలా పిలిచాడు. అన్ని సమస్యలనూ స్వల్పకాలంలోనే పరిష్కరిస్తానని వాగ్దానం చేశాడు. మంచి రోజులు రానున్నాయన్నది హిట్లర్ నినాదం. మంచి దుస్తులు వేసుకొని అందంగా కనిపించేందుకు హిట్లర్ చూసేవాడు. అబద్దాలను నిజాలుగా భ్రమింపచేసే కళను హిట్లర్ ప్రదర్శించేవాడు.రేడియోలో ఉపన్యాసాలు ఇచ్చేందుకు హిట్లర్ ఇష్టపడేవాడు. స్నేహితులు, సోదరులు, సోదరీమణులంటూ తన ప్రతి ప్రసంగంలో హిట్లర్ మాట్లాడేవాడు. హిట్లర్‌కు ఫొటోలు తీయించుకోవటమంటే పిచ్చి.

పైన పేర్కొన్నవాటిలో నరేంద్రమోదీకి ఏ లక్షణాలు, ఏమి ఉన్నాయో లేవో ఎవరికి వారు బేరీజు వేసుకోవచ్చు. చిన్న తనంలో ఒక రైల్వే స్టేషన్‌లో టీ అమ్మినట్లు మోదీ చెప్పుకున్న సంగతి తెలిసిందే. దానికి ఆధారాలు లేవని చెబుతారు. హిట్లర్ చిన్న తనంలో, కాస్త వయస్సు వచ్చాక కూడా ఆర్థికంగా ఇబ్బందులు పడినట్లు, అనాధ గృహాల్లో గడిపినట్లు చరిత్ర చెబుతున్నది. హిట్లర్ హైస్కూలు విద్యను కూడా పూర్తి చేయకపోవటంతో ఉన్నత విద్యకు అర్హత సాధించలేకపోయాడు. నరేంద్రమోదీ ఉన్నత విద్య చదివినట్లు చెప్పుకున్నా దానికి తగిన ఆధారాలు లేవు. నాజీల బాటలో నడుస్తుందనే విమర్శలున్న ఆర్‌ఎస్‌ఎస్‌లో మోదీ చాలా తక్కువ కాలంలోనే ప్రముఖ స్థానాలకు ఎగబాకారు. హిట్లర్ ఒకనాడు జర్మనీలో దేవుడిగా ఒక వెలుగు వెలిగాడు. మోదీని కూడా అభిమానులు అలాగే చూస్తున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడే స్వయంగా మోదీ దేవుడి బహుమతి, పేదల పట్ల దేవదూత అని చెప్పిన సంగతి తెలిసిందే.

2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి వరకు జరిగిన లేదా జరిపిన ప్రచారంలో ఇండియా కూటమి బీజేపీ విధానాలపై విమర్శలతో పాటు ఆ కూటమిలోని పార్టీలు విడివిగా ప్రకటించిన మానిఫెస్టోలోని అంశాలను, బీజేపీ చెబుతున్నట్లుగా నాలుగువందల సీట్లు ఎందుకు కోరుతున్నదో, ఏం చేసేందుకు అన్నిసీట్లు కోరుతున్నదో స్పష్టంగానే ప్రచారం చేశాయి. బీజేపీ వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను ఎత్తివేస్తుందన్నది ప్రధానమైన విమర్శ. పదేండ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ఎంతసేపూ ఎన్నిమరుగుదొడ్లు కట్టించిందీ, ఎన్ని ఉజ్వల గాస్ కనెక్షన్లు ఇచ్చిందీ, రోడ్లు వేసిందీ చెప్పుకోవటం తప్ప జన జీవితాలను మెరుగుపరిచేందుకు చేసిందేమిటో పెద్దగా చెప్పలేదు. పచ్చి అవాస్తవాలను, ఆధారంలేని ఆరోపణలను ఎన్నింటినో స్వయంగా నరేంద్రమోదీ ప్రచారం చేస్తున్నారు. ప్రపంచ చరిత్రలో ఇంతగా వక్రీకరణ, అవాస్తవాలు, అభూత కల్పనలు ప్రచారం చేసిన ప్రభుత్వ నేత మరొకరు లేరన్నది వేరే చెప్పనవసరం లేదు. మీడియాలో ఎన్ని టీవీ ఛానళ్లు వాటి గురించి చర్చలు పెట్టాయి, ఎన్ని పత్రికలు ప్రముఖంగా విశ్లేషణలు, వాస్తవాలను వెల్లడించాయి ? ఇదేం ప్రచారం అన్నట్లుగా కొందరు గొణగినట్లు విమర్శించటం తప్ప గట్టిగా బట్టబయలు చేసే ధైర్యం చేయటం లేదు. విదేశీ మీడియాలో కూడా ఇదే వ్యక్తమైంది.

నరేంద్రమోదీ ఇన్ని పచ్చి అబద్దాలను ప్రచారం చేయటం వెనుక ఉన్న మతలబు ఏమిటి ? పలుకుబడి దిగజారుతున్న పూర్వరంగంలో మైనారిటీ విద్వేషంతో లాభం లేదని గ్రహించి కాబోలు ముందే చెప్పుకున్నట్లు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రామాలయాన్ని బుల్‌డోజర్లతో కూల్చివేస్తారంటూ హిందువులను రెచ్చగొట్టి లబ్దిపొందాలన్నది స్పష్టంగా కనిపిస్తున్నది. నిజానికి మసీదులు, చర్చీలను కూల్చివేసిన చరిత్ర కాషాయ దళాలది తప్ప ఇతర పార్టీలది కాదు.

ఆర్‌ఎస్‌ఎస్, మోదీకి మధ్య పెరిగిన దూరం

అరుణ్ శ్రీ వత్సవ

వందేళ్లనాడు స్థాపించిన ఆర్‌ఎస్‌ఎస్‌కు ప్రధాని మోదీకి ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలలో ఎడం బాగా పెరిగింది. ఆర్‌ఎస్‌ఎస్ బీజేపీ మాతృసంస్థ. ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్‌భవత్‌కు మోదీ ప్రాధాన్యత ఇవ్వడంలేదని ఇప్పటికే సంఘ్‌పరివార్ ఆగ్రహంగాఉంది. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అవమానించాడన్న వార్తలొస్తున్నాయి. నాలుగురోజుల క్రిత నడ్డా చేసిన ప్రకటనలో "మేము (బీజేపీ)సొంతంగా ఎదిగాము, మరింత సామర్థ్యం కలిగిఉన్నాము. వివాదాస్పదమైన మధుర, కాశీలలో ఆలయాలు కట్టాలని ప్రణాళికలేదు. ఆలయాలు కట్టాలని ఆర్‌ఎస్‌ఎస్ కోరుకుంది. ఇప్పుడు బీజేపీ సొంతంగా బలపడేస్థాయి ఉంది" ఆర్‌ఎస్‌ఎస్ 'సైద్ధాంతిక సంస్థ" అదిసొంతంగా తన పనిచేసుకోగలదు. నడ్డా తమని అవమనించారని అతనొక మందబుద్ధిగల వాడని ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వం విమర్శించింది. మోదీని అదుపు చేయడంలేదని భగవత్‌ను కూడా ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నాయకులు విమర్శిస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ విమర్శలు మోదీకి తెలిసినప్పటికీ అంతగా పట్టించుకోలేదు. రెండేళ్ల క్రితం ఆర్‌ఎస్‌ఎస్‌లో ద్వితీయస్థానంలో ఉన్న ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే బీజేపీ ప్రభుత్వం అత్యంత నీచస్థితిలో ఉందని విమర్శించారు. భగవత్ ఏదొక చర్య తీసుకునిఉంటే పరిస్థితి ఇంత దిగజారిపోకుండా ఉండేదని నాయకులు విమర్శించారు. మోదీ, అమిత్‌షాలు ఒకరిపై ఆధారపడుతూ, మనుగడ సాగిస్తారని కూడా తీవ్రంగా విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులపై తీవ్ర విమర్శలుచేసే సమయం ఇదేనని భావించి ఉండవచ్చు. అయితే పరిస్థితి మాత్రం తీవ్రతరం కానున్నది. సైద్ధాంతిక బోధకులు, రాజకీయ నాయకులను చురుకైన నాయకుడు అవమానించడు. లోక్‌సభ ఎన్నికలు జరగనున్న సందర్భంలో దేశంలో కార్యకర్తలందరికీ తప్పుడు సందేశాలను పంపడం జరగదు. జరగబోయే పరిణామాలనుసైతం పట్టించుకోకుండా మాట్లాడారు. బీజేపీని సంఘ్‌పరివార్ ఆధిపత్యం నుంచి విడిపించేందుకు తమ మాస్టర్లు సిద్ధంగా ఉన్నారని భావించి నడ్డా తీవ్రంగా మాట్లాడారు. మితవాద భావజాలానికి, హిందుత్వ రాజకీయాలకు నిజంగా తామే ప్రతినిధులమని నడ్డా వ్యాఖ్యానించారు. తారెత్తించగల పరిణామాలు నడ్డాను భయం గొలపలేదు.

నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ కొన్ని భ్రమలను తొలగిందని నడ్డా వ్యాఖ్యానించారు. ఇవి ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తుందని అన్నారు. మోదీ తూర్పు నుంచి పడమరకు, ఉత్తరం నుంచి దక్షిణం వరకు ప్రజలు మోదీని ఆశీర్వదిస్తున్నారని నడ్డా వ్యాఖ్యానించారు.

మోదీని పొగిడి ఆయన ఆదరణకోసమే ఇలా మాట్లాడి ఉండవచ్చు. ఆర్‌ఎస్‌ఎస్ బీజేపీకి సైద్ధాంతిక బోధకుని స్థానం నుంచి వైదొలగుతుందని కూడా నడ్డా అన్నారు. మోదీ ఉద్దేశాలను నడ్డా ఏ మాత్రం దాచలేదు. తన అధికారాన్ని స్వభావం తగ్గిపోవడానికి మోదీ అంగీకరించడు. ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాలను మోదీ అంగీకరించే స్థితిలో లేరు. వాస్తవంగా మోదీ ఏనాడూ ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాలను సమ్మతించలేదు. సంఘ్‌పరివార్ సలహాలను మోదీ చెత్తబుట్టలో వేశారు. 2019లో మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి ఆయనకు రెక్కలొచ్చాయి. మోదీ చేసే తప్పులను వదిలేసి ఆయన ద్వారా హిందూ రాష్ట్రం ఏర్పాటును సాధించాలన్నది భగవత్ లక్ష్యం. స్వచ్ఛత, మంచితనం, పారదర్శకత అనేది మోదీకి ఎంత మాత్ర ముఖ్యమైనవి కాదు.

మోదీ పనివిధానం పెద్దగా నచ్చకపోయినా ఆయనను ఏమీ మాట్లాడకుండా ఉన్నందువల్ల ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వం భగవత్ మీద కూడా నిరసన వ్యక్తం చేస్తోంది. మోదీ పాలనా విధానంపైన ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. మోదీ ఎవరిని సంప్రదించకుండా అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. బీజేపీ సీనియర్ నాయకులు సైతం మోదీ ముందు మరుగుజ్జులయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాలను మోదీ పట్టించు కోవడంలేదు. మోదీని ఏమాత్రం భగవత్ మందలించడంలేదు. ఆర్‌ఎస్‌ఎస్‌ను పట్టించుకోకపోవడం తీవ్ర విభేదాలకు దారితీసింది. భగవత్‌కు కొంతమంది ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నాయకులు ఫిర్యాదు చేసినప్పటికీ ఉపయోగంలేకుండా పోతోందని సంఘ్‌వర్గాలు చెబుతున్నాయి.

మమూరాష్ట్రను గుజరాత్ కాలనీగా మార్చివేయాలని మోదీ ప్రయత్నిస్తున్న విషయాన్ని భగవత్‌కుచెప్పి ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్రలోని గుజరాత్ పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకోసమే మోదీ ప్రయత్నం చేస్తున్నారని ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు చెబుతున్నారు. మహారాష్ట్రలో ఏర్పాటుచేసిన కొన్ని పరిశ్రమలను గుజరాత్‌కు తరలిస్తున్నారని భగవత్‌కు ఫిర్యాదు చేశారు. గుజరాత్‌కు చెందిన ప్రజలు మహారాష్ట్ర ప్రజలపట్ల వ్యతిరేకంగా ఉన్నారని చెబుతున్నారు. 1953 డిసెంబరులో ఫజల్ అలీ కమిషన్ ఆంధ్రప్రదేశ్ తెలుగురాష్ట్రాల ప్రజలతో సహా వివిధ రాష్ట్రాలు అనుసరించవలసిన విధివిధానాలను ప్రకటించింది. అయితే ఆరోజు కమిషన్ మహారాష్ట్ర, గుజరాత్‌లను వేరుచేయడం పరిష్కారంగా అనుకోలేదు. మరాఠీ ప్రజలు మే 1వ తేదీన మహారాష్ట్ర దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జరుపుకుంటారు. ముంబై నగరంతో సహా మహారాష్ట్రను ఒక రాష్ట్రంగా ఏర్పాటుచేసిన తర్వాత మే 1న రాష్ట్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

కర్నాటకలో నెలకొల్పిన నందిని మిల్క్ కో ఆపరేటివ్ సంస్థను మూసివేసి గుజరాత్‌లో ఏర్పాటు చేసిన అమూల్‌సంస్థకు అప్పచెప్పాలని మోదీ ప్రయత్నించారని ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు విమర్శించారు. గుజరాత్‌కు చెందిన ఇరువురు నాయకులు తమ హోదాను ఉపయోగించుకుని రాష్ట్రాలకు తమకు కావలసిన రీతిలో ఆదేశాలు ఇస్తున్నారు. గుజరాత్ వ్యాపారవేత్తలను గుజరాతీలు పట్టించుకుని వారి బాగోగులు చూడాలని కూడా వీరువురు ఆదేశించారు. రాహుల్ గాంధీ అదానీకి మోదీ అడ్డగోలుగా సహకరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు అధ్వాన్నమైన స్థితిలో ఉండిపోయారని రాహుల్ విమర్శించారు. తాను వేసే ప్రశ్నలకు మహారాష్ట్ర ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కనీసం జవాబుచెప్పే పరిస్థితిలో కూడా లేరని అన్నారు. అదానీని లక్ష్యంగా పెట్టుకుని మోదీ సాగిస్తున్న వ్యవహారాలను ఆర్‌ఎస్‌ఎస్ ప్రశ్నించకుండా ఉన్నది. మోదీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న అంశాన్ని కూడా ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ప్రస్తావించడంలేదని రాహుల్ అన్నారు. మోదీ క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారాన్ని తెలుసుకుని రాహుల్‌పై చేస్తున్న విమర్శలు ఆయనకే సహకరిస్తున్నాయని అర్‌ఎస్‌ఎస్ అభిప్రాయపడుతోంది. రాహుల్ వేసేప్రశ్నలకు కనీసం సమాధానాలు సైతం చెప్పడంలేదని ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఐదు దశల ఎన్నికలు పూర్తయ్యాయి. మరో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు జూన్ 4న వెల్లడవుతాయి. హిందీ రాష్ట్రాల్లో బీజేపీ గణనీయంగా సీట్లను వదులకోవలసి వస్తోందని సూచనలు అందాయి.

ఓట్ల కోసమే చెరకు మద్దతు ధర పెంపు!

బొల్లిముంత సాంబశివరావు

చెరకు సేద్యం తీవ్ర సంక్షోభంలో ఉంది. చెరకు పంట విస్తీర్ణత తగ్గుతూ వస్తున్నది. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే అందుకు కారణంగా ఉంది. సంక్షోభ నివారణకు చర్యలు తీసుకోకుండా, ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు మోదీ ప్రభుత్వం చెరకు మద్దతు ధరను క్వింటాల్ కు 315నుంచి340 రూపాయలకు పెంచి చెరకు రైతులను ఉద్ధరించినట్లుగా ప్రచారం చేసుకుంటున్నది. పెరిగిన సేద్యపు ఖర్చుల దృష్ట్యా పెంచిన మద్దతు ధర రైతాంగానికి ఎటువంటి ఊరట కల్పించదు. దేశంలో 5కోట్ల కుటుంబాలు చక్కెర రంగంపై ఆధారపడి ఉన్నాయి. బ్రెజిల్ తర్వాత ప్రపంచంలో అత్యధికంగా పంచదార ఉత్పత్తి చేస్తున్నది భారతదేశమే. ప్రపంచ ఉత్పత్తిలో భారత్ వాటా 17శాతం ఉంది. దేశంలో చెరకుసాగు, రికవరి, పంచదార ఉత్పత్తిలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాలే 80శాతం ఉత్పత్తి చేస్తున్నాయి. 2015-16లో దేశంలో 2.72 కోట్ల టన్నులుగా ఉన్న పంచదార ఉత్పత్తి 2017-18 నాటికి 3.23కోట్లకు పెరిగి 2019-20 నాటికి 2.72 కోట్లకు తగ్గింది. ఇందుకు సాగు విస్తీర్ణత తగ్గటమే కారణం. ప్రారంభంలో ఎంతో అనుకూలంగా ఉన్న చెరకు సాగు నేడు పాలకుల విధానాలతో తీవ్ర సంక్షోభంలో కొనసాగుతున్నది.

ప్రస్తుతం దేశంలో మనుగడలో ఉన్న చక్కెర కర్మాగారాలు 500పైగా ఉన్నాయి. వీటిల్లో 2015 కర్మాగారాలకు డిస్టిలేషన్ సామర్థ్యం ఉంది. 121 చక్కెర మిల్లులు ఇథనాల్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ 29 చక్కెర మిల్లులు ఉండగా 17 మిల్లులు మూత పడ్డాయి. తెలంగాణలో 7 మిల్లులు మాత్రమే పనిచేస్తున్నాయి. దేశంలో చక్కెర మిల్లుల ప్రధాన ఉత్పత్తి పంచదార. ముడి పంచదారను తెచ్చి ప్రాసెస్‌చేసి తిరిగి పంపించటం ద్వారా చెరకు గానుగ ఆడగా వచ్చే మొలాసిస్, చెరకు పిప్పి తదితరాల ద్వారా కూడా మిల్లులకు ఆదాయం వస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో 49వేల హెక్టార్లు, తెలంగాణలో 29 హెక్టార్లలో చెరకు సేద్యం జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో చెరకు సేద్యం ప్రారంభంలో రైతుకు ఉచితంగా విత్తనం, రెండు బస్తాల ఎరువులు, 4 వేల ఆర్థిక సహాయం ఫ్యాక్టరీ యజమానుల నుంచి లభించేది. ఇప్పుడు ఇటువంటి ప్రోత్సాహకం రైతుకు లభించటం లేదు. పాలకుల విధానాల ఫలితంగా విత్తనం, ఎరువుల, పురుగు మందులు, డీజిల్ ధర విపరీతంగా పెరగటంతో ఉత్పత్తి ఖర్చు కౌలుతో కలిపి 30 వేలకు చేరుకున్నది. సగటు దిగుబడి ఎకరాకు 32 టన్నులు. చాలా మంది రైతులకు ఈ దిగుబడి కూడా రావటం లేదు.

మద్దతు ధరల నిర్ణయంలో కేంద్ర ప్రభుత్వం కూడా రైతుల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుని ప్రకటించటం లేదు. చెరకు మద్దతు ధర అందుకు మినహాయింపు కాదు. రైతుల అన్ని రకాల పంట ఖర్చులను పరిగణలోకి తీసుకోకుండా కేంద్రం చెరకు మద్దతు ధరలను ప్రకటిస్తున్నది. చెరకు మిల్లుల యజమానుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే ధర నిర్ణయిస్తున్నది. క్వింటాల్‌కు పది, పదిహేను రూపాయలకు మించి మద్దతుధర ఏ సంవత్సరం పెరగటంలేదు. పంట ఖర్చులు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయి. 2024-25 సంవత్సరానికి మోదీ ప్రభుత్వం క్వింటాల్‌కు 315నుంచి 340రూపాయలకు పెంచి మద్దతు ధర ప్రకటించింది. ఈ ధర రావాలంటే పంచదార రికవరీ రేటు 10.25శాతం ఉండాలి. దీనిపై ప్రతి 0.1 ఎక్కువ రికవరీకి రూ.3.05 అధనంగా ప్రీమియం అందిస్తోంది. రికవరీలో 0.1శాతం తగ్గుదల ఉంటే ప్రాథమిక ధరలో రూ.3.05 తగ్గుతుంది. ఎక్కువ మంది రైతులకు రికవరీ రేటు తక్కువగా ఉండటం వలన మద్దతు ధరలో కోత పడి తక్కువ వస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎకరా సగటు దిగుబడి 32 టన్నులు.

2024-25 మద్దతు ధర ప్రకారం టన్ను చెరకుపై రైతుకు 3,400 రూపాయలు లభించగా, ఎకరాకు (32 టన్నులు)వచ్చేది 1,08,800 రూపాయలు. కౌలుతో కలిపి పంట ఖర్చు లక్షా 30 వేలు. కౌలు రైతుకి పెట్టుబడి కూడా రాకపోగా 20వేల పైగా నష్టం వస్తుంది.

అనేక సమస్యల మధ్య చెరకును పండిస్తున్న రైతాంగానికి చెరకు విక్రయం, న్యాయమైన ధర లభించటం సమస్యగా మారింది. విక్రయించిన చెరకుకు డబ్బులు పొందటం మరొక సమస్యగా తయారైంది. చెరకు కొనుగోలు చేసిన 14రోజుల్లో రైతుకు మిల్లులు డబ్బులు చెల్లించాలి. అలా చెల్లించని పక్షంలో వడ్డీతోసహా రైతుకు ఇవ్వాలి. కాని మిల్లుయజమానులు దీన్ని అమలు జరపటం లేదు. అనేక మంది మిల్లు యజమానులు రైతులకు చెల్లించాల్సిన వేలకోట్ల రూపాయలు సంవత్సరాల తరబడి చెల్లించక పోవటంతో వారు తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నారు. 2020-21 క్రషింగ్ సీజన్ ముగిసే నాటికి ఉత్తరప్రదేశ్‌కి చెందిన అతిపెద్ద చక్కెర మిల్లు రైతులకు 12,733కోట్లు, మహారాష్ట్రలో అతిపెద్ద చక్కెర మిల్లు 4,190.20 కోట్లు రైతులకు బకాయిలు పడ్డాయి. కర్నాటక, పంజాబ్, హర్యాన, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కూడా వందల కోట్లు మిల్లు యజమానులు రైతులకు చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయి. సేద్యం గిట్టుబాటు కాక అప్పుల్లో ఉన్న రైతులకు ఎటువంటి ఆర్థిక ప్యాకేజీ ప్రకటించని మోదీ ప్రభుత్వం నష్టాలపేరుతో మిల్లు యజమానులకు వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. పంచదార కేజీ ఉత్పత్తి ఖర్చు 37 రూపాయలగా ఉంటే, విక్రయ ధర 31 రూపాయలుగా ఉండటం వలన నష్టపోయి రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించలేక పోతున్నామని మిల్లు యజమానుల చెబుతున్నారు. ఇది వాస్తవంకాదు. బహిరంగ మార్కెట్లో కిలో పంచదార 60 రూపాయల దాకా ఉంది. వంద కిలోల పంచదార ద్వారా 6 వేల ఆదాయం వస్తుంది. టన్ను చెరకు నుంచి లభించే 40 లీటర్ల మొలాసిస్ నుంచి 10 లీటర్ల ఇథనాల్ లభిస్తుంది. దీని ఆదాయం 6వందలకు పైగా వస్తుంది. అంతే కాకుండా చెరకు పిప్పి ద్వారా కూడా మిల్లుకి ఆదాయం లభిస్తుంది. వీటన్నిటి ద్వారా టన్ను చెరకు పైన మిల్లు యజమానికి లభించే ఆదాయం 6,800 రూపాయలు. మద్దతు ధర ప్రకారం టన్ను చెరకుపై రైతుకు వచ్చేది 3,400 రూపాయలు మాత్రమే. అంతర్జాతీయ మార్కెట్లో ముడి పంచదార చౌకగా లభించటంతో దిగుమతి చేసుకుని అధిక లాభం కోసం నష్టమనే కారణాలు ఫ్యాక్టరీల యజమానులు ముందుకు తెస్తున్నారు. పంచదార ఉత్పత్తి కన్నా ఇథనాల్ ఉత్పత్తి మిల్లులకు ఎక్కువ లాభసాటిగా ఉండటంతో పంచదార ఉత్పత్తి నుంచి వైదొలగేందుకు సిద్ధమౌతున్నారు. పంచదార ఎగుమతులు తగ్గిన ఫలితంగా నిల్వ పెరుగుతున్నదని మిల్లు యజమానులు చెబుతున్నారు. బ్రెజిల్ తదితర దేశాల్లో రైతాంగానికి అనేక రాయితీలు, నాణ్యమైన విత్తనం అందటం, దిగుబడి పెరగటం, రికవరిశాతం ఎక్కువగా ఉండటం వలన అంతర్జాతీయ మార్కెట్లో ఆ దేశాల పంచదార ధర తక్కువ ఉంటున్నది, అలాంటి ప్రోత్సాహంలేని మనదేశంలో ధర ఎక్కువగా ఉండటంతో మార్కెట్లో మన రైతాంగం పోటీ పడలేక పోతున్నారు. రైతాంగానికి మద్దతు ధర పెంచి, నాణ్యమైన విత్తనం అందించి, సహాయక ప్యాకేజీలు ప్రకటించి, ఎగుమతి సుంకాన్ని తగ్గించి, దిగుమతి సుంకాన్ని పెంచితే అంతర్జాతీయ మార్కెట్లో భారతదేశం పోటీకి నిలబడగలుగుతుంది.

చెరకు సేద్యం సంక్షోభానికి, రైతుల ఆత్మహత్యలకు మోదీ ప్రభుత్వం చెప్పే కారణాలు తన బాధ్యత నుంచి తప్పించుకునే విధంగా ఉంది. సోలాపూర్ జిల్లాలో హైవే ప్రారంభోత్సవంలో మోదీ సమక్షంలో మంత్రి నితిన్ గడ్కరీ చెరకు సంక్షోభం మనం సృష్టించింది కాదని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వల్ల ఏర్పడిందని, బ్రెజిల్ పంచదార రేటు చౌకగా లభించటం వలన మన చెరకు రైతుల, కర్మాగారాల సంక్షోభానికి కారణమని, చెరకు సేద్యం పంచదార ఉత్పత్తికి కాకుండా ఇథనాల్ ఉత్పత్తి కోసం చేయాలని, ఇథనాల్ ఉత్పత్తి కోసం 4,400 కోట్ల పథకం ప్రకటించామని చెప్పారు. దీన్ని గమనిస్తే పంచదార కాకుండా ఇథనాల్ ఉత్పత్తిని మోదీ ప్రభుత్వం ప్రోత్సహిస్తూ పంచదారను దిగుమతి చేసుకోనున్నదని అర్థమౌతుంది. ఫలితంగా పంచదారకు విదేశాలపై ఆధార పడాలి.

సెల్:9885983526

సమరాంగణం 2024

ఈశాన్య ఢిల్లీ ఎవరిది?

మనోజ్ తివారీ x కన్హయకుమార్

దేశరాజధాని దిల్లీలో అందరినీ ఆకర్షిస్తున్న నియోజకవర్గం ఈశాన్య ఢిల్లీ. హ్యాట్రిక్ విజయం కోసం చెమటోడుస్తున్న బీజేపీ ఎంపీ మనోజ్ తివారీపై, యువనాయకుడు కన్హయ కుమార్‌ను కాంగ్రెస్ పోటీకి దింపింది. గత ఎన్నికల్లో బీహార్‌లోని బెగుసరాయ్‌లో సీపీఐ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన కన్హయకుమార్ ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌కు అతి సన్నిహితుడుగా మారాడు. కన్హయని రాహుల్ గాంధీ ఈసారి దిల్లీలో పోటీకి దింపడం చర్చనీయాంశంగా మారింది. 20శాతం ముస్లింలు, 11శాతం ఎస్సీల సమీకరణను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ఈ ప్రయోగం చేసిందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

ఈశాన్య ఢిల్లీ ప్రాంతం దేశ రాజధానిలో అతిపెద్ద జిల్లా. ఇది దేశం మొత్తంలో అత్యంత జనసాంద్రత ఎక్కువగా ఉన్న నియోజకవర్గం. ఇక్కడ నివసిస్తున్న వారిలో అత్యధికులు పూర్వాంచల్‌కు చెందినవారే. ఈ లోక్‌సభ స్థానంలో అనేక అనధికార కాలనీలు ఉన్నాయి. ఇక్కడ వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చినవారు స్థిరపడ్డారు. ఉత్తరప్రదేశ్‌తో ఈశాన్య ఢిల్లీ సరిహద్దు కారణంగా, ఇందులో ప్రధానంగా ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా నుంచి వలస వచ్చిన వారి జనాభా ఎక్కువగా ఉంది. ఈ లోక్‌సభ స్థానంలో భజన్‌పురా, బురారీ, తిమర్‌పూర్, సీలంపూర్, ఘోండా, బాబర్‌పూర్, గోకల్‌పూర్, సీమాపురి, రోహతాస్ నగర్, ముస్తఫాబాద్, కరవాల్ నగర్‌లతో కలిపి 10 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

2009 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీపై కాంగ్రెస్ 59.03 శాతం ఓట్లతో భారీ ఆధిక్యం సాధించగా బీజేపీకి 33.71 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆ తరువాత 2014 నుంచి వరుసగా బీజేపీ విజయకేతనం ఎగరేస్తోంది. 2014లో సినీ నటుడు మనోజ్ తివారీ 45.38 శాతం ఓట్లతో గెలుపొందగా, 2019లో 53.86 శాతం రెండోసారి గెలిచారు. ఈ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజల్లో మంచి పేరుంది.

ఒకవైపు రాజకీయాలకు అతీతంగా నటుడిగా, గాయకుడిగా మనోజ్ తివారీ బాగా ప్రజాదరణ పొందారు. దిల్లీలో బీజేపీ సీఎం అభ్యర్థిగా మారేందుకు ఈ ఎన్నిక మనోజ్ తివారీకి కీలకంగా మారనుంది. ఇప్పటికే రెండుసార్లు గెలిచి సత్తా చాటిన తివారీ హ్యాట్రిక్ సాధించడం ద్వారా దిల్లీ బీజేపీ అగ్రనాయకుడిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకునే అవకాశం ఉంది. దిల్లీలో సరైన నాయకుడు లేక బీజేపీ అష్టకష్టాలు పడుతోంది. అందువల్లే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓడుతున్నట్టు భావిస్తోంది. పార్టీకి సారథ్యం వహించడానికి తివారీకి ఈ ఎన్నికలు ఒక అవకాశమనే అంచనాలొస్తున్నాయి.

కాంగ్రెస్ అభ్యర్థి కన్హయకుమార్ జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షునిగా, ఏఐఎస్ఎఫ్ నాయకునిగా దేశవ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కన్హయకుమార్ చాలా చురుకుగా కనిపించారు. ఈ యాత్రలతో యువతను కనెక్ట్ చేయడంలో ఆయన చాలా ముఖ్యమైన పాత్ర పోషించారు. షీలా దీక్షిత్ తర్వాత దిల్లీలో కాంగ్రెస్‌కు ఫైర్ బ్రాండ్ లీడర్ కరువయ్యారు. కన్హయకుమార్ కనుక ఈశాన్య దిల్లీ నుంచి గెలిస్తే ఆయన కూడా దిల్లీ కాంగ్రెస్‌కు భవిష్యత్ ముఖ్యమంత్రి నాయకునిగా ఎదిగే అవకాశముంది.

తుక్‌డేతుక్‌డే గ్యాంగ్ నాయకుడని బీజేపీ..కన్హయకుమార్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తోంది. బీజేపీ మొదటి నుంచి కన్హయ్‌కు వ్యతిరేకంగానే ఉన్నది. జేఎన్‌యూలో విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు ఆయనపై దేశద్రోహం నేరం కూడా బనాయించింది. ఈ ఎన్నికలలో ప్రజలు కన్హయకుమార్ పట్ల ఆకర్షితులు కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న బీజేపీ ఆయనపై దాడికి కూడా పాల్పడింది. ఈ దాడిని అన్ని రాజకీయ పక్షాలు ముక్తకంఠంతో ఖండించాయి. సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టరు కె. నారాయణ, బీకే కాంగో, దిల్లీ రాష్ట్ర నాయకులు దినేశ్ వర్షిణీ తదితరులతో కూడిన ప్రతినిధివర్గం బుధవారం కన్హయకుమార్ ఎన్నికల కార్యాలయాన్ని సందర్శించి ఆయనను పరామర్శించింది.

కన్హయకుమార్‌కు పూర్తి మద్దతు ప్రకటించింది. మరి ఈసారి దిల్లీ ఈశాన్యంలో కమలం వికసిస్తుందా? హస్త రేఖలు మారతాయా? అన్నది ఓటరు చేతిలో ఉంది.

హోరాహోరీలో విజేతలెవరు?

25న ఆరో విడత... 58 స్థానాల్లో పోలింగ్

మెజారిటీ సీట్ల కోసం పార్టీల ప్రయత్నాలు



దేశంలో సార్వత్రిక ఎన్నికల సమరం తుది అంకానికి చేరుకుంది. అత్యధిక నియోజకవర్గాల్లో పోలింగ్ ముగిసింది. మరో పది రోజుల్లో జరగనున్న రెండు దశల పోలింగ్ ముగియడంతో ఎన్నికల ప్రక్రియకు తెరపడుతుంది. మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరగాల్సి ఉండగా ఇప్పటికి ఐదు విడతల పోలింగ్ ముగిసింది. ఆరో విడత పోలింగ్ ఈ నెల 25వ తేదీన, ఏడో విడత పోలింగ్ జూన్ 1న జరగనుంది. ఈ నెల 25న ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ స్థానాలకు జరగనున్న ఎన్నికల సమరాంగణంలో 889 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని పరీక్షించుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో 14, బీహార్‌లో 8, హర్యానాలో 10, దిల్లీలో 7, పశ్చిమ బెంగాల్‌లో 8, జార్ఖండ్‌లో 4, ఒడిశాలో 6, జమ్మూ కాశ్మీర్‌లో ఒక స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ 58 లోక్‌సభ నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో ఎక్కువ సీట్లలో ఎన్డీయే కూటమి గెలుపొందింది. అధికారంలోకి రావాలని పట్టుదలతో ఉన్న ఇండియా కూటమి ఈ 58 స్థానాల్లో మెజార్టీ సీట్లు గెలుచుకుంటే అధికారానికి దగ్గరయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. గత ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించిన బీజేపీని ఓడించి ఇండియా కూటమి తన సత్తా చాటితే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీ ఫిగర్‌కు ఇండియా కూటమి చేరుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఆరో దశలో పోలింగ్ జరగనున్న 58 లోక్‌సభ స్థానాల్లో 2019లో కాంగ్రెస్ ఒక్కసీటూ గెలుచుకోలేదు. ఆ ఎన్నికల్లో 40 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. బీఎస్పీ 4, టీఎంసీ 3, బీజేడీ 4, జేడీయూ 3, ఎల్‌జేపీ ఒకటి, ఏజేఎస్‌యూ ఒకటి, నేషనల్ కాన్ఫరెన్స్ ఒక స్థానంలో గెలుపొందాయి. ఎస్పీ కూడా ఒక్క సీటు గెలుచుకుంది. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, ఆర్జేడీ వంటి పార్టీలు తమ ఖాతాను తెరవలేకపోయాయి. హర్యానా, దిల్లీలో బీజేపీ క్లీన్ స్వీప్ చేసింది. ఈసారి కేంద్రంలో అధికారంలోకి రావాలంటే ఇండియా కూటమి ఖాతా తెరవడమే కాకుండా బీజేపీ గతంలో గెలిచిన సీట్ల సంఖ్యను తగ్గించి అత్యధిక నియోజకవర్గాలలో విజయం సాధించడం అవసరం. ఈసారి దిల్లీ, హర్యానాలో బీజేపీకి సీట్లు తగ్గే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. గతంలో సాధించిన 40 సీట్లను గెలుచుకునేందుకు బీజేపీ సైతం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. హ్యాట్రిక్ సాధిస్తామన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలలు నిజం కావాలంటే మరోసారి ఈ 58 నియోజకవర్గాల్లో ఎన్డీయే అధిపత్యాన్ని కొనసాగించాల్సి ఉంటుంది. మరోవైపు ప్రాంతీయ పార్టీలకు ఆరో దశ ఎన్నికలు అగ్నిపరీక్ష కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆరో దశలో ఎవరు అధిపత్యం ప్రదర్శిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

ముగిసిన ఎన్నికలు.. మొదలైన వలసలు

ఒడిశాలో తొలిదశ కింద పోలింగ్ ముగిసిన జిల్లాల నుంచి వలసలు తిరిగి మొదలయ్యాయి. రాయగడ జిల్లాలో మే 13న పోలింగ్ పూర్తి కావడంతో జిల్లా నుంచి వలసలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఓట్లు వేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కొద్దిరోజుల కిందట రాష్ట్రానికి చేరుకున్న స్థానికులు మళ్లీ వారు పనిచేసే ప్రాంతాలకు పయనమవుతున్నారు. వీరితో పాటు మరికొంత మంది యువత, కార్మికులు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలసబాట పడుతున్నారు. దీంతో రైల్వేస్టేషన్, బస్టాండ్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోతున్నాయి. పొరుగురాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే వలసకార్మికులు రాయగడ నుంచి బస్సుల్లో ప్రయాణించేందుకు బస్టాండ్‌కు చేరుకుంటున్నారు. తమిళనాడు, గుజరాత్, కేరళ, కర్నాటక తదితర రాష్ట్రాలకు వలస వెళుతున్న వారంతా సంబంధిత రైళ్లను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్రంలో 3 వేలకు పైగా చిన్న, మధ్యతరహా, పెద్ద పరిశ్రమలు ఉన్నప్పటికీ వలసలకు అడ్డుకట్ట పడకపోవడాన్ని అనేక మంది తప్పుపడుతున్నారు. కనీసం ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయా రాష్ట్రాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్న కార్మికులను మరోసారి వలసలు వెళ్లకుండా ఉండేలా ఆపడం, స్థానికంగా ఉపాధి కల్పిస్తామన్న భరోసా ఇచ్చే ప్రయత్నాలు నేతలు ఎందుకు చేయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

11 సమితులున్న రాయగడ జిల్లాలో కాశీపూర్, కె.సింగ్‌పూర్, చంద్రపూర్, గుడారి సమితుల నుంచి ఎక్కువ మంది వలసలు వెళుతున్నట్లు తెలుస్తోంది. కాశీపూర్ సమితి పరిధిలో చందగిరి, తొలొడెస్కు, తొలజొరి, బంటేజి, సింధూరఘాట్, బొరిగూడ, పొడమజ్జి తదితర గ్రామాల నుంచి ఎక్కువగా కర్నాటక, కేరళకు వలస వెళుతుండడం గమనార్హం. చంద్రపూర్ సమితి బెల్లంగూడ, జరప, బందరి, కటిసూర్ గెండబజు, కిలుండి, రాయిబిజి గ్రామాలు కె.సింగ్‌పూర్ సమితి పరిధి పొలమ, సిరిపూర్, బలుముస్కా, సెరిగుమ్మ, ఫులోగూడ, తొలసజ తదితర గ్రామాల నుంచి తెలుగు రాష్ట్రాలతో పాటు గుజరాత్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళ్తున్నట్లు సమాచారం.

అవి పాక్ సానుభూతి పార్టీలు

కాంగ్రెస్, ఎస్పీపై మోదీ విమర్శలు

లక్నో: పాకిస్థాన్ వద్ద అణుబాంబులు ఉన్నాయంటూ దేశ ప్రజలను భయపెట్టేందుకు కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. ఆ రెండు పార్టీలు పాక్‌కు సానుభూతిపరులు అని వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లోని బస్తీలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ 2017లో యూపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి ప్రచారం చేసిన ఈ రెండు పార్టీలు (కాంగ్రెస్, ఎస్పీ) ఓటమి చవిచూశాయని, ప్రస్తుతం మళ్లీ అవి కలిసి ప్రచారం చేయడం తనకు ఆశ్చర్యం కలిగిస్తోందని ప్రధాని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు ఉగ్రవాదం పేరుతో మనల్ని బెదిరించినవారు ప్రస్తుతం ఆహార ధాన్యాల కోసం అల్లాడుతున్నారని, పాకిస్థాన్ పని అయిపోయిందని అన్నారు. కానీ, ఆ దేశ సానుభూతిపరులైన ఎస్పీ, కాంగ్రెస్ మాత్రం దేశాన్ని భయపెట్టే పనిలో బిజీగా ఉన్నాయని మోదీ ఆరోపించారు. పాక్ వద్ద అణు బాంబులున్నాయని మనం భయపడాలని కాంగ్రెస్, ఎస్పీ అంటున్నాయని, ఈ 56 అంగుళాల ఛాతీ గురించి వారికి తెలియదా అని ప్రశ్నించారు. ఇది బలహీన కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, బలమైన మోదీ సర్కార్ అని గొప్పలు చెప్పారు. మనల్ని బెదిరించాలని ప్రయత్నించే వారిని భారత్ వదిలిపెట్టదని, వారి దేశంలోకి వెళ్లి మరీ వాళ్ల అంతు చూసిందని మోదీ చెప్పారు. కాగా, లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఐదు విడతలు పూర్తయ్యే సరికి మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమైందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ యువరాజులు కలిసి యూపీలో 79 సీట్లు గెలుస్తామంటూ వదంతులు సృష్టిస్తూ, పగటి కలలు కంటున్నారని అన్నారు.

జూన్ నాల్గో తేదీన ప్రజలే వారిని మేలుకొలుపుతారని, అప్పుడు ఈవీఎంలను నిందిస్తూ గగ్గోలు మొదలుపెడతారని విమర్శించారు. తరచు మనలను బెదిరించే ఉగ్రవాద దేశమైన పాకిస్థాన్ అతలాకుతలమైందని, ఇప్పుడు భారత్‌ను కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ బెదిరించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. పాకిస్థాన్‌ను చూసి మనం భయపడాలని వారు చెబుతున్నారని మోదీ అన్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ప్రసంగించారు.

'అగ్నివీర్' రద్దు, రైతులకు రుణమాఫీ

మహేంద్రగఢ్ సభలో రాహుల్‌గాంధీ హామీ

న్యూఢిల్లీ: ఇండియా కూటమి అధికారంలోకి రాగానే 'అగ్నివీర్' పథకాన్ని రద్దు చేస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో ఇండియా కూటమి మెజారిటీ సాధించడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. అగ్నివీర్ పథకంపై ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా రాహుల్ విమర్శలు గుప్పించారు. హర్యానాలోని మహేంద్రగఢ్‌లో జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. అగ్నివీర్ పథకం ద్వారా ప్రధాని మోదీ భారత జవాన్లను కూలీలుగా మార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. అగ్నివీర్ పథకాన్ని సైన్యం కోరుకోవడం లేదని, దీనిని ప్రధాని కార్యాలయం రూపొందించిందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని చెత్తబుట్టలో పడేస్తామని చెప్పారు. హర్యానా రైతులు పొలాల్లో కష్టపడుతున్నారని... మోదీ ప్రభుత్వం మాత్రం బిలియనీర్లకు సాయం చేసేలా ల్యాండ్ ట్రిబ్యునల్ బిల్లును రద్దుచేసి రైతుల హక్కులను కాలరాసిందన్నారు. మూడు వ్యవసాయ బిల్లులను తీసుకువచ్చిందని, దీనిపై భారత్ జోడో యాత్రలో రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మీడియాలో ఎక్కడా కనిపించలేదని అన్నారు. ప్రధాని మోదీ 22 మంది సంపన్నుల రుణాలు మాఫీ చేశారని ఇది రైతులను అవమానించడమేనని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రైతుల రుణాలను మాఫీ చేస్తామన్నారు. యూపీఏ హయాంలో రైతుల రుణాలు మాఫీ చేశామని గుర్తు చేశారు. ఇక హర్యానాలోని మొత్తం పది పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఆరో దశలో భాగంగా మే 25న పోలింగ్ జరగనుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో హర్యానాలోని మొత్తం పది నియోజకవర్గాల్లో బీజేపీ విజయం సాధించింది.

ఇదేమీ అందాల పోటీ కాదు

ప్రధాని అభ్యర్థిపై జైరాం రమేశ్ సమాధానం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష 'ఇండియా' కూటమికి ప్రధాని అభ్యర్థే లేరంటూ బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలపై కాంగ్రెస్ ఘాటుగా స్పందించింది. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఏడాదికి ఒకరు చొప్పున ప్రధాని పదవిని పంచుకుంటారంటూ ప్రధాని మోదీ చేస్తున్న ఆరోపణలపై తాజాగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇదేం అందాల పోటీ కాదని సమాధానమిచ్చారు. 'ఎన్నికలంటే వ్యక్తుల మధ్య జరిగే అందాల పోటీ కాదు. అందుకే నరేంద్రమోదీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిని ప్రకటించలేదు' అని అన్నారు. తాము అధికారంలోకి వస్తే కేవలం కొన్ని గంటల్లోనే ప్రధాని పేరును ఖరారు చేస్తామని వెల్లడించారు. కూటమిలో ప్రధాని అభ్యర్థి ఎంపిక ఎలా ఉండనుందనే దానిపై తమ ఫార్ములాను జైరాం రమేశ్ బయటపెట్టారు. '2004 ఎన్నికల తర్వాత ప్రధానిగా మన్మోహన్ సింగ్ పేరును నాలుగు రోజుల్లో ఖరారు చేశాం. ఈసారి రెండు రోజులు కూడా పట్టదు. గెలిచిన ఎంపీలంతా సమావేశమైన కొన్ని గంటల్లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటారు. నాడు ప్రధానిని ఎలా ఎంపిక చేశామో... అదే ఫార్ములాను ఇప్పుడూ అమలుచేస్తాం. కూటమిలో ఎక్కువ సీట్లు వచ్చిన పార్టీకి చెందిన వ్యక్తే ప్రధాని అవుతారు' అని జైరాం రమేశ్ స్పష్టంచేశారు. విపక్ష కూటమి ప్రధాని అభ్యర్థిపై మోదీ చేసిన విమర్శలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే కూడా ఖండించిన సంగతి తెలిసిందే. 'యూపీఏ 1, యూపీఏ 2 హయాంలో మాకు మిత్రపక్షాలు పూర్తి మద్దతు ఇచ్చాయి. పదేళ్ల పాటు ఒకే వ్యక్తి (మన్మోహన్ సింగ్) ప్రధానిగా కొనసాగారు' అని గుర్తుచేశారు.

కలకత్తా హైకోర్టులో బీజేపీకి చుక్కెదురు

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు వ్యతిరేకంగా ప్రకటనలు ప్రచురించకుండా నిషేధిస్తూ కలకత్తా హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి కలకత్తా హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది. సింగిల్ బెంచ్ ఎలాంటి విచారణ చేపట్టకుండానే ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొంటూ బీజేపీ దాఖలు చేసిన అప్పీలుపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఎలాంటి ప్రకటనలు ప్రచురించకూడదని బీజేపీని ఆదేశించిన సింగిల్ బెంచ్ ఆర్డర్‌లో జోక్యం చేసుకోవడానికి డివిజన్ బెంచ్ నిరాకరించింది. లక్ష్మణరేఖకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేసింది.

జాతీయ భద్రతతో మమత రాజీ: అమిత్‌షా



కోల్‌కతా: ఓటు బ్యాంక్ కోసం జాతీయ భద్రతతో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీపడుతున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆరోపించారు. చొరబాటుదారులను రాష్ట్రంలోకి అనుమతించడం ద్వారా ఆమె పాపానికి పాల్పడుతున్నారని అన్నారు. పశ్చిమబెంగాల్ చొరబాటుదారులకు స్వర్గధామంలా మారడం వల్ల ఆ ప్రభావం రాష్ట్రంపైనే కాకుండా యావద్దేశం పైన పడుతుందని చెప్పారు. ఈస్ట్ మిడ్నాపూర్‌లోని కాంతిలో బుధవారం జరిగిన ర్యాలీలో అమిత్‌షా మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న 42 లోక్‌సభ సీట్లలో 30 సీట్లు బీజేపీ గెలుచుకుంటే తృణమూల్ కాంగ్రెస్ బీటలు వారుతుందని, రాష్ట్రంలో మమతా బెనర్జీ పాలనను సాగనంపేందుకు ఇది సంకేతమవుతుందని అన్నారు. రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ సంఘానికి చెందిన కొందరు సన్యాసులు దిల్లీలో బీజేపీ నాయకుల ప్రభావంతో పనిచేస్తున్నారని మమతా బెనర్జీ ఇటీవల చేసిన వ్యాఖ్యలను అమిత్‌షా తోసిపుచ్చారు. సేవకు-నైతికతకు కట్టుబడిన సంస్థలను టీఎంసీ తన ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు బెదిరిస్తోందని అన్నారు. భారత్ సేవాశ్రమ్ సంఘం లేకుంటే బంగ్లాదేశ్‌లో ఒక భాగంగానే పశ్చిమబెంగాల్ మిగిలిపోయేదని, ఆ వాస్తవం మమతా బెనర్జీకి తెలియకపోవచ్చని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ హింస దాదాపు ప్రజాస్వామ్యాన్ని తుడిచిపెట్టేసిందని, పంచాయతీ ఎన్నికల్లో 200 మందిగా పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారని అమిత్‌షా అన్నారు. కాంతి ప్రజలు భయపడాల్సిన పనిలేదని, ఐదు విడతల పోలింగ్‌లో మమత గూండాలు ఏ ఒక్కరినీ టచ్ చేయలేకపోయారని పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్ తర్వాత కూడా పారామిలటరీ కంపెనీలను ఇక్కడే ఉంచాలని ఈసీకి తాము విజ్ఞప్తి చేస్తామని అమిత్‌షా భరోసా ఇచ్చారు.

అన్ని మతాలు, వర్గాలకు గౌరవం

- కాంగ్రెస్ హయాంలో ఎవరికీ నష్టం జరగలేదు
- అబద్ధాల ప్రచారంలో మోదీ దిట్ట
- 'రామమందిరంపై బుల్డోజర్' వ్యాఖ్యలు సరికాదు
- ఓట్ల కోసం ప్రజలమధ్య చిచ్చు పెట్టడమే బీజేపీ ధ్యేయం
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అయోధ్యలోని రామమందిరంపై బుల్డోజర్ నడుపుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలను, అన్నివర్గాలవారి విశ్వాసాలను గౌరవిస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అబద్ధాలాడటంలో దిట్ట అని... ఇలాంటివి ఆయన మాత్రమే మాట్లాడగలరని మండిపడ్డారు. కాంగ్రెస్ 55 ఏళ్లుగా అధికారంలో ఉందని... ప్రధాని చెప్పినట్లు ఎవరినీ పూజించకుండా చేయడం లేదా ఎవరి మంగళసూత్రాన్ని తీయించలేదని ఖడ్గే అన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖడ్గే మాట్లాడుతూ... బీజేపీ ఆరోపిస్తున్నట్లు ఏ సమాజంలోనైనా పేదలకు సహాయం చేయడం బుజ్జగించడం కాదని ఆయన అన్నారు. మోదీ, బీజేపీ ఓట్ల కోసం సంతోషంగా జీవిస్తున్న ప్రజల మధ్య విభజన తెచ్చేందుకే ఇలాంటి పనులు చేస్తున్నారని... బుల్డోజర్ వాడుతున్నారని ఇతరులపై నిందలు వేస్తున్నారని ఖడ్గే చెప్పారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో పేదలను ఆదుకునేందుకు పథకాలు ప్రవేశపెట్టిన ప్రతిసారీ కాంగ్రెస్‌పై బీజేపీ తప్పుడు ప్రచారం సృష్టించిందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత చట్టం, గ్రామీణ ఆరోగ్య మిషన్‌ను కాంగ్రెస్ పార్టీ తొలిసారిగా తీసుకొచ్చినప్పుడు బీజేపీ వాటిని వ్యతిరేకించిందని ఖడ్గే చెప్పారు. భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయాకరణను కూడా వ్యతిరేకించిందని తెలిపారు. తాము పేదల కోసం పథకాలు ప్రవేశపెట్టినప్పుడల్లా విమర్శించారని... ఇప్పుడు పేదలకు డబుల్ రేషన్ ఇస్తామని మాట్లాడుతున్నారని ఖడ్గే అన్నారు. బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారనే మోదీ విమర్శలను ఖడ్గే తోసిపుచ్చారు. "ఏ వర్గానికైనా అన్యాయం జరగకుండా ఆపడం బుజ్జగింపు కాదు. ఎన్నికల సమయంలో వారు పోలరైజ్ చేయడానికి ప్రయత్నిస్తారు. వారు (బీజేపీ) మేము చేసే ప్రతి పనిని బుజ్జగింపుగా చూపడానికి ప్రయత్నిస్తారు. పేదలకు ఏదైనా ఇవ్వడం లేదా పేదలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం, ముస్లింలకు ప్రత్యేక పాఠశాలల ద్వారా విద్యను అందించడం అనేది బుజ్జగింపుగా పేర్కొనబడదు" అని ఖడ్గే స్పష్టం చేశారు. మత ప్రాతిపదికన కోటాలు ఇవ్వాలని కాంగ్రెస్ కోరుకుంటోందని, అందుకే రిజర్వేషన్ సీలింగ్‌ను పెంచాలని పిలుపునిస్తోందన్న బీజేపీ విమర్శలను ఖడ్గే తిరస్కరించారు. "తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ ఉంది... ఇవి ముస్లింలకేనా? తమిళనాడులోలాగా పరిమితి పెంచుతామని చెబుతున్నాం. ఇందులోకి ముస్లింలు ఎలా వస్తారు? ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతున్నాం...వారిలో ముస్లింలు ఉండరా" అన్నారు. బీజేపీ ప్రతిదాన్ని గురించి అపార్థాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తుందన్నారు. కుల గణన జరపాలనే డిమాండ్‌ను సమర్థిస్తూ... గతంలో కులాల గణనను మినహాయించారని, సామాజిక న్యాయం జరగలేదన్నారు. పేదలకు, వెనుకబడిన వారికి సహాయం చేసేందుకు మేము ఒక విధానాన్ని రూపొందిస్తామన్నారు. ఇప్పటివరకు మేము ఎవరి హక్కులను లాక్కోలేదని తెలిపారు. ప్రజలకు మంచి జరగడం బీజేపీకి ఇష్టం లేదని... దుష్ప్రచారాలు సృష్టిస్తున్నారని చెప్పారు. గతంలో ఏడాదికి రూ.72వేలు అందజేస్తామని హామీ ఇచ్చామని, ఇప్పుడు పేదలకు రూ.లక్ష ఇస్తామని చెబుతున్నామన్నారు. కర్నాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆ పని చేశాయని చెప్పారు. పేదల కోసం తాము ప్రవేశపెట్టిన పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని ఖడ్గే తెలిపారు. బీజేపీ ధనిక వ్యాపారవేత్తలకు 16 లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిందని... పేదలకు లక్ష రూపాయలు ఇవ్వలేరా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధ్వర్యంలో ఇండియా కూటమి అధికారంలోకి రాగానే ఆర్థిక వ్యవస్థను మళ్లీ పట్టాలపైకి తీసుకువస్తామన్నారు. స్టాక్ మార్కెట్లలో ఇటీవలి ఒడిదుడుకులపై ఖడ్గే మాట్లాడుతూ... ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయ్యేలా చూసుకోవాల్సింది ఆర్థికవేత్తలేనని అన్నారు. 'నేను లేకపోతే ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం అవుతుందని మోదీ అన్నారు. కానీ మోదీజీ హయాంలో దేశం రూ.155 లక్షల కోట్ల అప్పుల్లోకి వచ్చింది. కాంగ్రెస్ హయాంలో ఏళ్లు గడిచినా రూ.55 లక్షల కోట్ల అప్పులోనే ఉంది. అధికారంలో ఉండటం వల్ల, వారు తమ తప్పులను దాచడానికి ప్రయత్నిస్తూ... ప్రతిపక్షాలను నిందిస్తారు' అని ఆయన అన్నారు.

ఇండియా కూటమి గెలుపే లక్ష్యం

కన్హయ కుమార్ కార్యాలయానికి సీపీఐ ప్రతినిధులు

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ఆరవ దశలో భాగంగా ఢిల్లీలో పోలింగ్ జరగబోతోంది. ఇండియా కూటమి తరపున ఏడుగురు పోటీ చేస్తున్నారు. వీరందరూ గెలువాలనే లక్ష్యంతో ప్రచార ర్యాలీలు, ఇంటింటి ప్రచారాన్ని ఇండియా కూటమి పార్టీలు నిర్వహిస్తున్నాయి. ఇదే క్రమంలో ఈశాన్య ఢిల్లీ బరిలో నిలిచిన ఇండియా కూటమి అభ్యర్థి కన్హయ కుమార్ ఎన్నికల కార్యాలయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రతినిధులు సందర్శించారు. ఏడుగురు ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యమన్నారు. ప్రజా వ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఇండియా కూటమి పోరాడుతోందని తెలిపారు. ఇండియా కూటమి అభ్యర్థుల తరపున ప్రచార ర్యాలీల్లో పాల్గొనడమే కాకుండా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు సీపీఐ ప్రతినిధులు వెల్లడించారు. కన్హయ కార్యాలయానికి వెళ్లిన ప్రతినిధుల్లో పార్టీ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె. నారాయణ, డాక్టర్ బీకే కాంగో, ఢిల్లీ కార్యదర్శివర్గ సభ్యులు అబ్సర్ అహ్మద్, సంజీవ్ కుమార్ రాణా, సమితి సభ్యులు బబ్బన్ కుమార్ సింగ్, రామ్ ప్రసాద్ ఆత్రీ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సీపీఐ ప్రతినిధులకు కాంగ్రెస్ నాయకత్వం ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది.

అదరను... బెదరను: మలివాల్

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్‌పై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు విభవ్ కుమార్ దాడికి సంబంధించిన వ్యవహారం రోజురోజుకు మరింత వివాదమవుతోంది. ఈ ఘటన తర్వాత తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఆప్ నేతలు ప్రయత్నిస్తున్నారని మలివాల్ తాజాగా మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. తన వ్యక్తిగత ఫొటోలు లీక్ చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఆప్ సీనియర్ నేత ఒకరు నిన్న తనకు కాల్ చేశారని, తనపై అభ్యంతరకర ఆరోపణలు చేయాలంటూ పార్టీలోని ప్రతి ఒక్కరిపై ఒత్తిడి పెరుగుతున్నట్లు మలివాల్ తెలిపారు. తన వ్యక్తిగత ఫొటోలు లీక్ చేసేందుకు కుట్రలు జరుగుతున్నట్లు ఆ నేత తెలిపారు. తనకు మద్దతుగా మాట్లాడిన వారిని పార్టీ నుంచి బహిష్కరిస్తామని బెదిరిస్తున్నారని, తనకు వ్యతిరేకంగా మీడియా సమావేశాలు నిర్వహించేందుకు కొందరిని ఏర్పాటు చేశారని ఆరోపించారు. సోషల్ మీడియాలో పోస్టులు చేసే బాధ్యతను మరికొందరికి అప్పగించారని, రిపోర్టర్లను కొట్టి తనపై నకిలీ స్టింగ్ ఆపరేషన్లు చేయించాలని చూస్తున్నారని మలివాల్ పేర్కొన్నారు. తన గురించి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిపై కోపం లేదని, నిందితుడు చాలా శక్తిమంతమైన వ్యక్తి అని, పార్టీలో బడానేతలు కూడా అతడికి భయపడతారని ఆమె తెలిపారు. అతడిని ఎదిరించి మాట్లాడే ధైర్యం ఎవరికీ లేదన్నారు. ఇవన్నీ తనను బాధించట్లేదని, అయితే ఢిల్లీ మహిళా మంత్రి (అతిశీ) కూడా నవ్వుతూ తనను అవమానిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. 'మీరు వేల మంది సైన్యాన్ని దించినా నేను ఒంటరిగా ఎదుర్కొంటా. ఎందుకంటే నిజం నావైపు ఉంది. నా ఆత్మగౌరవం కోసం ఈ పోరాటం మొదలు పెట్టా. న్యాయం జరిగే వరకు కొనసాగిస్తా. నేను ఒంటరి కావొచ్చు... ప్రయత్నాన్ని మాత్రం వదిలిపెట్టను' అని మలివాల్ చెప్పారు.

కేంద్రానికి రూ.2.11 లక్షల కోట్లు

ఆర్‌బీఐ నిర్ణయం

ముంబై: కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఇతోధిక సాయం ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2.11 లక్షల కోట్లు డివిడెండ్‌గా చెల్లించేందుకు నిర్ణయించింది. గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలో ఆర్‌బీఐ కేంద్ర బోర్డు డైరెక్టర్లు ఈ మేరకు సమావేశమై మిగులు నిధులను ప్రభుత్వానికి బదిలీ చేయడానికి ఆమోదం తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ రూ.87,416 కోట్లు డివిడెండ్ రూపంలో చెల్లించింది. దీంతో పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో 140 శాతం అధికంగా డివిడెండ్ చెల్లిస్తున్నది. ఈ ఏడాది రూ.75,000-1,20,000 కోట్ల మేర నిధులు బదిలీ చేస్తారని ఆర్థిక వేత్తలు అంచనా వేయగా... అంతకుమించి చెల్లించేందుకు ఆర్‌బీఐ బోర్డు నిర్ణయించింది. ఆర్‌బీఐ ఇచ్చిన డివిడెండ్ వల్ల కేంద్రం తన ద్రవ్యలోటు పూడ్చుకోవడానికి ఉపయోగపడనుంది. దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడంతో కంటిన్‌జెంట్ రిస్క్ బఫర్ లెవల్‌ను కూడా 6 శాతం నుంచి 6.50 శాతానికి పెంచింది. ఏటా ఆర్‌బీఐ మిగులు నిధులను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో చెల్లిస్తుంటుంది. పెట్టుబడులు, డాలరు నిల్వలపై విలువల మధ్య వ్యత్యాసం, కరెన్సీ ప్రింటింగ్ ఫీజు వంటి రూపాల్లో ఆర్‌బీఐకి ఆదాయం సమకూరుతుంది. ఇందులో మిగులు నిధులను కేంద్రానికి బదిలీ చేస్తుంటుంది. 2024-25 ఆర్థిక సంవత్సర తాత్కాలిక బడ్జెట్‌లో ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల డివిడెండ్ల రూపంలో ఖజానాకు రూ.1.02 లక్షల కోట్లు సమకూరుతాయని ప్రభుత్వం అంచనా వేసింది.

ఒకే గొడుగు కిందకు ఆర్‌కేవీవై, కృషోన్నతి

- రూ.1,193 కోట్లతో పథకాలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం
- అమలు తీరుపై సీఎస్ జవహర్‌రెడ్డి సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై), కృషోన్నతి యోజన కింద వ్యవసాయ, అనుబంధ రంగాల్లోని పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి అమలు చేసేందుకు వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024-25 అమలుపై రాష్ట్రస్థాయి మంజూరు కమిటీ భేటీ అయింది. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. రాష్ట్రీయ కృషి వికాసయోజన, కృషోన్నతి యోజన కింద 2024-25లో వార్షిక కార్యాచరణ ప్రణాళిక కింద రూ.1193 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వివిధ పథకాలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి అమలు చేస్తున్నారు. ఈ వార్షిక కార్యాచరణ ప్రణాళిక కింద చేపట్టనున్న వివిధ పథకాలకు సంబంధించి కేటాయించిన నిధుల మంజూరు తదితర అంశాలపై సీఎస్ జవహర్ రెడ్డి వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. రాష్ట్రీయ కృషి వికాస యోజన వార్షిక కార్యాచరణ కింద నేల ఆరోగ్యం, వర్షాధార ప్రాంత అభివృద్ధి, తదితర పథకాలకు కేటాయించిన నిధులు, వాటి ద్వారా చేపట్టిన కార్యక్రమాలను అధికారులతో సీఎస్ చర్చించారు. వ్యవసాయ రంగంలో రూ.134 కోట్ల వ్యయంతో కస్టమ్ హైరింగ్ కేంద్రాల్లో డ్రోన్లను అందుబాటులోకి తేవడం, రైతు భరోసా కేంద్రాల ద్వారా సామూహిక ఎలుకల నిర్మూలన, జిల్లాస్థాయిలో పెస్టిసైడ్స్ పరిశోధనా కేంద్రాలు, వాటికి తగిన పరికరాలను అందుబాటులోకి తేవడం అంశాలపై ఆరా తీశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆ శాఖ కమిషనర్ సీహెచ్ హరికిరణ్, ఉద్యానవన శాఖ కమిషనర్ శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా శాఖలకు సంబంధించి అమలు చేస్తున్న కార్యక్రమాల్ని వివరించారు. ఈ సమావేశానికి రాష్ట్ర రైతు సాధికార సమితి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్, పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యారు.

ఆధార్ లేకుండానే క్లెయిమ్‌ల పరిష్కారం

ఖాతాదారులకు ఈపీఎఫ్‌ఓ శుభవార్త

న్యూఢిల్లీ: పీఎఫ్ ఖాతాదారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆధార్ కార్డు సమస్యగా పరిణమిస్తోంది. ఆధార్‌లో అన్ని వివరాలు సరిగ్గా ఉంటే ఇబ్బంది లేదు. కానీ ఆధార్ వివరాలు తప్పుగా ఉండి... అప్‌డేట్ చేయాలంటే ఫీల్డ్ ఆఫీస్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సభ్యుడి మరణం తర్వాత ఈపీఎఫ్ ప్రయోజనాలను క్లెయిమ్ చేసే ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) కొత్త నిబంధన తీసుకొచ్చింది. మరణానంతరం ఆధార్ వివరాలను అప్‌డేట్ చేయడం లేదా సరిదిద్దడంలో ఫీల్డ్ ఆఫీస్‌లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడం ఈ నిబంధన ప్రధాన లక్ష్యంగా ఉంది. దీంతో ఆధార్ లేకుండానే క్లెయిమ్‌లు ప్రాసెస్ చేయవచ్చని, మరణించిన సభ్యుల కుటుంబాలు ఈపీఎఫ్ ప్రయోజనాలను సులభంగా పొందవచ్చని ఈపీఎఫ్‌ఓ ప్రకటించింది. ఈ సడలింపు ఇ-ఆఫీస్‌లో ఆఫీస్ ఇన్ ఛార్జ్(ఓఐసీ) ఆమోదం పొందడంపై ఆధారపడి ఉంటుంది. ఇది తప్పనిసరిగా ధృవీకరణ విధానాలను డాక్యుమెంట్ చేయాలి.

ఐఓసీ ఆమోదం కోసం మరణించిన సభ్యుడి వివరాలు, హక్కుదారుల చట్టబద్ధత గురించిన కచ్చితమైన ధృవీకరణ అవసరం. మోసపూరిత ఉపసంహరణలను తగ్గించడానికి ఐఓసీ నిర్దేశించిన విధంగా అదనపు జాగ్రత్త చర్యలు తప్పనిసరి. యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్)లో సభ్యుల వివరాలు కచ్చితమైనవైతే యూనిక్ ఐడెంటిఫికేషన్(యూఐడీ) డేటాబేస్‌లో సరికాని లేదా అసంపూర్ణ సమాచారం ఉన్న సందర్భాల్లో సడలింపు వర్తిస్తుంది. ఆధార్ డేటా సరైనదైతే యూఏఎన్‌లో వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో, ఫీల్డ్ ఆఫీసులు మునుపటి సర్క్యులర్‌లలో పేర్కొన్న నిర్దిష్ట మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలి. కాగా, సాధారణంగా ఆధార్ రికార్డులలో తప్పుడు వివరాలు లేదా అసంపూర్ణమైన సభ్యుల వివరాలు, ఆధార్ సమాచారం లేకపోవడం, డీయాక్టివేట్ అయిన ఆధార్ ఖాతాలు, యూఐడీఏఐ డేటాబేస్ ద్వారా ఆధార్‌ని ధృవీకరించడంలో సాంకేతిక సమస్యలు ఉంటాయి. ఈపీఎఫ్‌ఓ... మే 17న విడుదల చేసిన సర్క్యులర్‌లో విధానపరమైన అడ్డంకులను పరిష్కరించడం, మరణించిన సభ్యుల కుటుంబాలకు సకాలంలో ఆర్థిక సహాయం అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

నిలిచిన 'ఆరోగ్యశ్రీ'

- ప్రభుత్వంతో చర్చలు మళ్లీ విఫలం
- తాత్కాలికంగా రూ.203కోట్లు విడుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. ఆరోగ్యశ్రీ సీఈఓతో ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులు జరిపిన చర్చలు మరోమారు విఫలమయ్యాయని ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ తెలిపింది. బుధవారం సాయంత్రం 3 నుంచి 4గంటల వరకు జూమ్ యాప్ ద్వారా ప్రభుత్వంతో చర్చలు జరిగాయి. రెండోసారి జరిపిన చర్చలు కూడా అసంపూర్తిగా ముగిశాయి. రూ.800 కోట్ల బకాయిలు విడుదల చేయాలని నెట్‌వర్క్ ఆసుపత్రులు కోరాయి. మొత్తం రూ.1500 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు మంజూరు చేసే వరకు ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు అసోసియే షన్ తెలిపింది. తాము రూ.203 కోట్ల బకాయిలు విడుదల చేసినట్టు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ డాక్టర్ లక్ష్మీషా తెలిపారు. మిగిలిన బకాయిలను కూడా త్వరలోనే విడుదల చేస్తామన్నారు. ఆసుపత్రుల యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పథకం కింద పేద, మధ్యతరగతి రోగులకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రోగులకు ఆరోగ్యశ్రీ సేవలు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించామన్నారు.

సీఎం కేజ్రీవాల్‌కు బెదిరింపు...నిందితుడి అరెస్టు

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను చంపుతానని బెదిరిస్తూ గ్రాఫిటీ వేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ద్వారా నిందితుడిని గుర్తించి బుధవారం అరెస్టు చేశారు. ఆయనను బరేలీకి చెందిన అంకిత్ గోయల్‌గా గుర్తించారు. ఢిల్లీ పోలీసుల మెట్రో యూనిట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని, దీనిపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు. ఈ పరిణామంపై ఆప్ స్పందించింది. ఈ ఘటన వెనుక బీజేపీ హస్తం ఉందని ఆరోపించింది. లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు నియోజకవర్గాల్లో ఓటమి పాలవుతుందన్న భయంతోనే ఈ చర్యలకు పాల్పడుతున్నారని తెలిపింది.

ఓబీసీ సర్టిఫికెట్లు రద్దు

కలకత్తా హైకోర్టు తీర్పు

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో 26 వేల మంది టీచర్ల ఉద్యోగాలు రద్దు చేసిన కలకత్తా హైకోర్టు... బుధవారం మరో సంచలన తీర్పు వెలువరించింది. 2010 తర్వాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అన్ని ఓబీసీ ధ్రువపత్రాలను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. 2012 నాటి పశ్చిమబెంగాల్ వెనకబడిన వర్గాల చట్టంలోని కొన్ని నిబంధనలు చట్టవిరుద్ధంగా ఉన్నాయని హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన ద్విసభ్య ధర్మాసనం... 2010-12 మధ్య రాష్ట్ర ప్రభుత్వం ఓబీసీ వర్గీకరణలుగా పేర్కొన్న 42 క్లాసులను కొట్టివేస్తున్నట్లు వెల్లడించింది. ఆ వర్గీకరణలు చట్టవిరుద్ధంగా ఉన్నాయని స్పష్టంచేసింది. అందువల్ల 2010 తర్వాత ఈ క్లాసుల కింద జారీ చేసిన ఓబీసీ సర్టిఫికెట్లన్నింటినీ రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. 1993 నాటి వెనకబడిన వర్గాల చట్టానికి అనుగుణంగా కొత్త ఓబీసీ జాబితా సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అయితే, ఈ క్లాసులతో జారీ అయిన ఓబీసీ ధ్రువ పత్రాలతో ఇప్పటికే ప్రయోజనాలు పొందుతున్నవారు, ఆ రిజర్వేషన్ల కింద ఉద్యోగాలు చేస్తున్నవారిపై ఈ తీర్పు ఎలాంటి ప్రభావం చూపదని న్యాయస్థానం వెల్లడించింది. హైకోర్టు తీర్పుపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసంతృప్తి వ్యక్తంచేశారు. దీన్ని తాము అంగీకరించబోమని తెలిపారు. ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించి బిల్లు తీసుకొచ్చామని, రాజ్యాంగానికి లోబడి తీసుకొచ్చిన ఈ బిల్లును శాసనసభ ఆమోదించిందని తెలిపారు. ఇప్పుడు బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి దీన్ని నిలిపివేయాలని కుట్ర పన్నిందని ఆరోపించారు. ఈ తీర్పును తాము అంగీకరించబోమని, ఓబీసీ రిజర్వేషన్లు కొనసాగుతాయని మమత స్పష్టంచేశారు.

ఎన్నికల బాండ్ల స్కామ్‌లో బీజేపీ నేతలు జైలుకే: మంత్రి అతిశీ

న్యూఢిల్లీ: జూన్ 4న ఇండియా కూటమి భారీ మెజారిటీతో గెలిచి కేంద్రంలో అధికారం చేపడుతుందని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు, ఢిల్లీ మంత్రి అతిశీ అన్నారు. ఆ తర్వాత ఎన్నికల బాండ్ల కుంభకోణంపై దర్యాప్తు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కేసులో బీజేపీ నాయకులు జైలుకు వెళతారని అన్నారు. ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులు సైతం కటకటాలపాలవుతారని పేర్కొన్నారు. ఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన అతిశీ... దేశ ప్రజలు తమ ఓట్లతో బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని ఎప్పుడో నిర్ణయించుకున్నారన్నారు. జూన్ 4 తర్వాత ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, దేశంలోనే అతిపెద్ద కుంభకోణం అయిన ఎన్నికల బాండ్ల స్కామ్‌పై విచారణ చేపట్టనున్నదన్నారు.

ఎన్నికల సమయంలోనే తెరపైకి పీఓకే: అసదుద్దీన్

ప్రయాగ్‌రాజ్: బీజేపీ 400 స్థానాలు పైగా సాధిస్తామని ఇప్పుడు చెప్పడం లేదని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. పెట్రోల్ ధరలు రూ.100 దాటాయని, ప్రధాని నరేంద్ర మోదీ బరిలో ఉన్న వారణాసిలో పేపర్ లీక్‌ల ఘటనల వంటి వాస్తవ అంశాలను కాషాయ పార్టీ మరుగునపడేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో అసదుద్దీన్ విలేకరులతో మాట్లాడారు. కాషాయ పార్టీ నేతలు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) గురించి పదేపదే మాట్లాడుతున్నారని, ఈ పదేళ్లలో పీఓకేను స్వాధీనం చేసుకునేందుకు ఎందుకు ప్రయత్నించలేదని, ఎన్నికల సమయంలోనే పీఓకే గుర్తుకొస్తుందా అని ఓవైసీ నిలదీశారు. పీఓకే భారత్‌లో అంతర్భాగమని తాము కూడా చెబుతున్నామని, దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని, అయితే ఎన్నికల సమయంలోనే పీఓకేను ఎందుకు తెరపైకి తీసుకువస్తున్నారని కాషాయ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

ముగ్గురు భారత విద్యార్థుల మృతి

వాషింగ్టన్: అమెరికాలో జార్జియా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారత సంతతి విద్యార్థులు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈనెల 14న ఈ ఘటన చోటుచేసుకోగా... అల్ఫారెట్టా పోలీసులు తాజాగా వివరాలు వెల్లడించారు. జార్జియా విశ్వవిద్యాలయంలో చదువుతున్న ఆర్యన్ జోషి, శ్రియ, అన్వీ శర్మ, రిత్విక్ సోమేపల్లి, మహ్మద్ లియాకత్ అనే ఐదుగురు భారత సంతతి విద్యార్థులు కారులో ఓ కార్యక్రమానికి వెళుతున్నారు. ఈ క్రమంలోనే జార్జియాలోని అల్ఫారెట్టా సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో ఆర్యన్ జోషి, శ్రియ అక్కడికక్కడే మరణించగా...అన్వీ శర్మ పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందారు. మిగతా ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత విద్యార్థులంతా 18 ఏళ్ల వయసు వారే కావడం గమనార్హం. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతి వేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.